Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 179
పేజీలు - 8 వెల - రూ 5 : 00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
శుక్రవారం 23, ఫిబ్రవరి-2024
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## మేడారంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు



3లో..

## కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు



- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం కసరత్తు
- బిఆర్ఎస్‌ను అణచివేసేలా వ్యూహాలు
- క్షేత్రస్థాయి నుంచి నరుక్కువస్తున్న రేవంత్

# గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క,సారలమ్మ

- తల్లు రాకతో గద్దెలవైపు ఎగబడిన జనం
- నిర్విఘ్నంగా పూర్తయిన అమ్మవార్ల రాక
- భక్త జనసంద్రంగా మారిన మేడారం



మేడారం మహా జనసంద్రమైంది. తల్లుల కోసం నలుదిశల నుంచి పరుగుపరుగున తరలివచ్చిన బిడ్డలతో మహారణ్యం జనారణ్యమైంది. ఎటుచూసినా జనమే జనం. అమ్మగద్దెలను దర్శించుకోవాలని వస్తున్న జనం అంతా చీమల దండులా కనిపిస్తోంది. జంపన్నవాగులో జనం స్నానాలను ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. చిలుకలగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కుంకుమభరణి రూపంలో ఉన్న సమ్మక్కను కోయ పూజారులు గద్దెపై ప్రతిష్టించడంతో ప్రధాన ఘట్టం ఆవిష్కృతం అయ్యింది. కాగా.. ఇప్పటికే సారమ్మను ఆదివాసీ పూజారులు కొమ్ము బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి



మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం మొదలయ్యింది. సమక్క గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో



తరలివస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం

## మరోమారు మోడీదే అధికారం : ఈటెల



ఆదిలాబాద్,ఫిబ్రవరి22 : మూడోసారి కూడా నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ... మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ ఇండియా వైపు చూస్తున్నాయ న్నారు. ఒకప్పుడు ఇండియాను అవమానించిన అగ్ర రాజ్యాలు ఇప్పుడు మన మెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిని మోదీ సమర్థ వంతంగా ఎదుర్కొన్నారని.. అగ్ర రాజ్యాలన్నీ ఈ విషయంలో చేతులెత్తేసిన సమయంలో ప్రపంచానికి మోదీ అండగా నిలిచారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## పట్టాలపైకి మరో రెండు గ్యారెంటీలు



- గృహజ్యోతి,గ్యాస్ సిలిండర్ పథకాల అమలు
- 27 లేదా 29న అమలుకు రంగం సిద్ధం
- కేబినెట్ సబ్‌కమిటీలో సిఎం రేవంత్ చర్చ
- విధివిధానాలపై సమగ్రంగా సమీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి22 :ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన గృహ జ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఈనెల 27 లేదా 29న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విధివిధానాలపై కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సబ్సిడీ ఎలా అందించాలనే అంశంపై చర్చించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మరో రెండు హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. కేబినేట్ సబ్ కమిటీతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, రూ. 500కే సిలిండర్ పై విధివిధనాలపై సమీక్ష నిర్వహించారు. ఈ పథకాలను ఫిబ్రవరి 27 లేదా29న ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ భేటీలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. వారంరోజుల్లో ఆరు గ్యారెంటీలలో మరో రెండిటిని అమలు చేస్తామని కొండగల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఫథకాల విధివిధినాలపై గురువారం రోజున కేబినేట్ సబ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు . కాగా ఇప్పటికే కాంగ్రెస్ మహిళలకు బస్సులో ఫ్రీ జర్నీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ లిమిట్ రూ.10 లక్షల పెంచి పథకాలను అమలు చేస్తోంది. గ్యాస్ ఏజెన్సీలతో చర్చలు జరపాలని సీఎం సూచించారు. గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.'ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి. లబ్దిదారుడు రూ.500 చెల్లిస్తే సిలిండర్ ఇచ్చేవిధంగా అనువైన విధానాన్ని అనుసరించాలి. సబ్సిడీని ఖాతాకు బదిలీ చేయాలా? ఏజెన్సీలకు చెల్లించాలా? అనుమానాలు, అపోహలకు తావు లేకుండా గృహజ్యోతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించారు. మార్చి మొదటి వారం నుంచి విద్యుత్తు బిల్లు జారీ చేసేటప్పుడు అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు జారీ చేయాలి. తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లలోపు గృహ విద్యుత్తు వినియోగించే వారందరికీ ఈ పథకం వర్తింపజేయాలి. ప్రజాపాలన దరఖాస్తుల్లో రేషన్ కార్డు నంబరు, విద్యుత్ కనెక్షన్ నంబరు తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయినవారు ఉంటే.. సవరించుకునే అవకాశమివ్వాలి. అలాగే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారుంటే ఎంపిడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సీఎం ఆదేశించారు.

## ఉద్రిక్తంగా మారిన చలో సెక్రటేరియట్



- షర్మిలను అరెస్ట్ చేసిన పోలీసులు
- నన్నే అరెస్ట్ చేపిస్తావా.. జగన్ నీ అంతు చూస్తా
- దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మ క్షోభిస్తుంది
- మండిపడ్డ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- అందుకే చెరకు మద్దతు ధరలను పెంచాం
- రైతుల ఆందోళనపై తొలిసారి ప్రధాని మోడీ స్పందన

## ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ

### వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పొడిగించాలి

### ప్రభుత్వానికి జిహెచ్ఎంసి లేఖ



హైదరాబాద్,ఫిబ్రవరి22 : వన్‌టైమ్ సెటిల్మెంట్‌గా ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పిం చాల్సి ందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే కనుక దీనిపై దృష్టి సారించాలన్నారు. త్వరలో ముగియనున్న ఈ ర్థికక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 2100 కోట్లు అయినప్పటికీ, గతనెల 20 వరకు రూ.1269 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల్లో ఉంది. నెలనెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పలు పర్యాయాలు కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ స్కీమ్ అమల్లోకి వస్తే ఆస్తిపన్ను

## ఐశ్వర్యారాయ్‌పై రాహుల్ వ్యాఖ్యల దుమారం

- మహిళల పట్ల రాహుల్‌కు సదభిప్రాయం లేదు
- మండిపడ్డ బిజెపి శ్రేణులు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి22 : బాలీవుడ్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయోధ్యలో సామాన్యులకు ఆహ్వా నం లేదని, కేవలం బచ్చన్ కుటుబం, ఐశ్వర్య డ్యాన్స్ మాత్రమే కనిపించిందని జోడోయాత్రలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండి పడింది. ఐశ్వర్యపై కించపరిచే వ్యాఖ్యలు చేసి, రాహుల్ మరింత దిగజారిపోయారని ఆరోపిం చింది. స్వయంకృషితో ఎదిగిన మహిళల పట్ల రా హుల్ భయంకరమైన స్వభావాన్ని కలిగి ఉన్నా రంటూ విమర్శలు గుప్పించింది. సీన్‌లోకి కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కూడా తీసుకొచ్చి చుర కలంటించింది. ఇదే సమయంలో.. ప్రముఖ గాయని సోనా మహపాత్ర కూడా రాహుల్‌పై మండి పడింది. రాజకీయ లబ్ది కోసం పొలిటీషియన్స్ మహిళల్ని కించపరిచడం కరెక్ట్ కాదని సూచిస్తూ.. ఐశ్వర్యకు మద్దతు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' సందర్భంగా.. రాహుల్ గాంధీ బీజేపీని టా÷-గ్గ్ ÷ట్ చేసుకొని విమర్శలు గుప్పించారు.

## ప్రజానాడి



## జాతీయహోదా అంటూ ఏదీ ఉండదు

- జాతీయస్థాయి గుర్తింపునకు చర్యలు
- మేడారం పర్యటనలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు
- మంత్రి వ్యాఖ్యలపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు



ములుగు,ఫిబ్రవరి22: మేడారం జాతరను జాతీయ హోదా పండుగగా గుర్తించలేమంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి జాతీయహోదా అంటూ ఏదీ లేదన్నారు. మేడారం జాతరపై కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఈ జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలని రాష్ట్ర నేతలు అడుగుతున్నారని, కానీ.. జాతీయ పండుగ అనే విధానం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. మేడారానికి జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఫిబ్రవరి 22వ తేదీ గురువారం రోజున మేడారంలో సారలమ్మను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడి పంటలతో దేశమంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లుగా తెలిపారు. ములుగులో గిరిజన వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని, ఈ ఏడాదే ప్రవేశాలకు అనుమతిస్తామని వెల్లడించారు. ఇందులో ఎక్కువ సీట్లుస్థానిక గిరిజన బిడ్డలకే ఇస్తామన్నారు. రూ. 900 కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తున్నామని.. వర్సిటీ భవనాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... బీజేపీకి గిరిజనులపై ప్రేమలేదన్నారు. బీజేపీ కపట ప్రేమ బయటపడిందని మండిపడ్డారు. మేడారంపై బీజేపీ వైఖరి దుర్మార్గమన్నారు. కిషన్ రెడ్డి మూర్ఖంగా మాట్లాడారని... బీజేపీది ధ్వంద వైఖరి అంటూ విరుచుకుపడ్డారు. మహబూబాబాద్ ఎంపీ కవిత మాట్లాడుతూ.. మేడారానికి జాతీయ హోదా ఇవ్వాలని పార్లమెంటులో కొట్లాడినమని తెలిపారు. జాతీయ హోదా ఇస్తే ప్రపంచ గుర్తింపు వస్తుందన్నారు. అమ్మవార్లకు గౌరవం దక్కాలంటే జాతీయ హోదా ఇవ్వాల్సిందే అని పట్టుబడ్డారు. కాంగ్రెస్ నేత అశోక్ మాట్లాడుతూ... మేడారం జాతరపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని మండిపడ్డారు. జాతీయ హెదా అనేది ఇక్కడి ప్రజల చిరకాల డిమాండ్ అన్నారు. ఆదివాసీల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రేకుర్తిలో ఘనంగా సమ్మక్క జాతర

- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం

కరీంనగర్,ఫిబ్రవరి22 : కరీంనగర్ జిల్లా రేకుర్తిలో సమ్మక్క- సారలమ్మ జాతర ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ 4వ డివిజన్‌లో కార్పొరేటర్ నుజహత్ అలీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు కోళ్లు పంపిణీ చేశారు. మేడారం సమ్మక్క సారక్క జాతరలో సందర్భంగా డివిజన్ ప్రజలు క్షేమంగా సుఖ సంతోషాలతో ఉండాలని కార్మికుల మొక్కు చెల్లించేందుకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలి పోతుందని కొన్ని రాజకీయ పార్టీలు ప్రగల్భాలు మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సమ్మక్క సారక్క అండ మాకుందని.. తమ ప్రభుత్వాన్ని ఎవరూ టచ్ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. తమది ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ఓప్రభుత్వమని.. ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసేలా కుట్ర చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేసి తారుతామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి 70 రోజులు కూడా కాలేదని.. అప్పుడే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# పాతబస్తీలో పర్యటించిన కమిషనర్

హైదరాబాద్,ఫిబ్రవరి22 : జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ గురువారం ఉదయం పాతబస్తీలో పర్యటించారు. యాకుత్పురా, చార్మినార్‌లోని పలు అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. ఎంపీ అసదుద్దిన్ ఓవైసీ,ఎంఐఎం ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనులను రోనాల్డ్ రోస్ పరిశీలించారు. మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్, చార్మినార్, సర్దార్ మహల్, మల్టీ లెవెల్ పార్కింగ్, ముర్గి చౌక్, మీర్ ఆలమ్ మండిలను పరిశీలించారు. అలాగే ఎంపీ అసదోద్దిన్ తో కలిపి రంగాపూర్ నాలాను జీహెచ్‌ఎంసీ రోనాల్ట్ రోస్ పర్యవేక్షించారు.

# రెవెన్యూ శాఖలో మంత్రి ఆకస్మిక తనిఖీ



## సకాలంలో డ్యూటీకి రాని వారే అధికులు

హైదరాబాద్,ఫిబ్రవరి22 : రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర సచివాలయంలో గురువారం రెవెన్యూ విభాగంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. రెవెన్యూశాఖ విభాగంలో ఉదయం 11.40 వరకు పూర్తిస్థాయిలో ఉద్యోగులు తమ తమ విధులకు హాజరు కాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.. కొంతమంది ఉద్యోగులు ముందస్తు సమాచారం లేకుండా ఆఫీసుకు రాకపోవడం, మరి కొంతమంది సమయానికి రాకపోవడం బాధ్యతరాహిత్యం అన్నారు. హాజరు పట్టికలు పరిశీలించారు... రెవెన్యూ విభాగంలోని ఐదు సెక్షన్లో ఏ సెక్షన్ లో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబు దారిగా ఉండాల్సిన అధికారులు విధుల్లో అలక్ష్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజా పాలనలో రెవెన్యూశాఖ కీలకపాత్ర వహిస్తుండగా ఇతర విభాగాలకు ఆదర్శంగా ఉండాల్సిన సచివాలయ అధికారులు, సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి నిజాయితీ నిబద్ధతతో పనిచేసిప్రభుత్వానికిమంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రిగారు వ్యాఖ్యానించారు.

# సన్ ఫ్లవర్ రైతులకు మంత్రి సూచన

## నేటినుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



హైదరాబాద్,ఫిబ్రవరి22 : తెలంగాణలో సన్ ఫ్లవర్ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచన చేశారు. రైతులు ఎవరూ తొందర పడొద్దని క్వింటా రూ.6,760 కంటే తక్కువ ధరకు విక్రయించొద్దని సూచించారు. అలాగే, శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని.. పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అటు, ఈ అంశంపై మంత్రి తుమ్మలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మంత్రికి ట్విట్టర్ వేదికగా వేదికగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సన్ ఫ్లవర్ రైతులు మద్దతు ధర లేక నష్టపోతున్నారని అన్నారు. 'ఈ ఏడాది మద్దతు ధర రూ.6,760 ఉండగా మార్కెట్ లో మాత్రం రూ.4 వేల నుంచి రూ.5 వేలకే రైతులు అమ్ముకుంటున్నారు. ప్రతి క్వింటాలుకు దాదాపు రూ.2 వేలు నష్టపోతున్నారు. గతంలో మా ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో మద్దతు ధరకు రైతుల నుంచి సన్ ఫ్లవర్ కొని రైతులను ఆదుకున్నాం. మీరు వెంటనే అధికారులను ఆదేశించి రాష్ట్ర వ్యాప్తంగా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు సన్ ఫ్లవర్ కొని రైతుల ప్రయోజనాలు కాపాడాలని కోరుతున్నానని అన్నారు.

# మేడారం జాతర ఆత్మగౌరవ ప్రతీక

## శుభాకాంక్షలు తెలిపిన మాజీ సిఎం కెసిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి22 : తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాలచేత పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా మాజీముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేండ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద అడవిబిడ్డల జాతరగా తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కొనసాగిన ఆత్మగౌరవ పోరాటంలో సమ్మక్క, సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. ఒకనాడు కల్లోలిత ప్రాంతంగా నాటి సమైక్య పాలకుల ఏలుబడిలో అలజడులకు గురైన గోదావరీ లోయ పరీవాహక ప్రాంతం నేడు సాగునీటి జీవజలంతో సస్యశ్యామలమై ప్రజల జీవితాల్లో సాంత్వన నింపిందని అన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి దేశవ్యాప్తంగా తల్లుల దర్శనార్థం కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

# ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ

(మొదటిపేజీ తరువాయి)




బకాయిదారులు అసలుతో పాటు బకాయిల వడ్డీలపై కేవలం 10 శాతం పెనాల్టీ చెల్లిస్తే సరిపోతుంది. అది ఎందరికో వెసులుబాటుగా ఉండటమే కాక జీహెచ్‌ఎంసీ కష్టాల నుంచి గె÷-టటెక్కేందుకూ ఉపకరిస్తుంది. ఈ అంశాన్ని వివరిస్తూ లేఖ రాశారు. పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అవకాశం కల్పించగలదని ఆశిస్తున్నారు. 4,95,628 ప్రైవే ట్ యజమానుల భవనాలకు సంబంధించి బకాయిలు రూ.1887.59 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో కలిపి అవి రూ.45 22.18 కోట్లకు పేరుకు పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1800 భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రూ. రూ.1622.16 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో సహ అవి రూ.5281.21 కోట్లకు పేరుకుపోయాయి. అన్నీ వెరసి పేరుకు పోయిన మొత్తం బకాయిలు రూ.9803.39 కోట్లు ఉన్నట్లు అంచనా.

# గద్దెలవద్ద కంకణావనం ప్రతిష్ట

- భారీగా తరలివస్తున్న భక్తజనం
- స్వాగత కార్యక్రమంలో మంత్రి సీతక్క



ములుగు,ఫిబ్రవరి22 :మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కావడంతో భక్తులు పులకించి పోయారు. గద్దెల వద్దకు జనం భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు వేయికళ్లతో ఎదురుచూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. గద్దెపై కంకవణాన్ని కోయపూజారులు ప్రతిష్టించారు. చిలకలగుట్ట నుంచి తెచ్చిన ప్రత్యేకజాతి వెదురు బొంగులే ఈ కంకవణాలు. చిలుకలగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చారు కుంకుమభరణి రూపంలో ఉన్న అమ్మవారిని కోయ పూజారులు మేడారంకు తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కాగా.. ఇప్పటికే సారమ్మలను ఆదివాసీ పూజారులు కొమ్ము బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం పూర్తయ్యింది. సమక్క గద్దెపైకి రాడంతో భక్తుల కోలాహలం కూడా పెరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మేడారం సమక్క - సారలమ్మ మహా జాతర కీలక ఘట్టానికి చేరిందని మంత్రి సీతక్క తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కోయ పూజారులు ఉపవాసం ఉండి పూజా కార్యక్రమాలు చేస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి చిలకలగుట్టలో పూజలు ప్రారంభమవుతాయన్నారు. సమ్మక్క వచ్చే ముందు జిల్లా ఎస్పీ శబరీష్ రెండు రౌండ్లు కాల్పులు జరిపి సమ్మక్కకు స్వాగతం పలుకుతారన్నారు. కంకవణాల మధ్య ఉండే సమ్మక్కకు ఆమె వచ్చే ముందు నీడ ఏర్పాటు కోసం కంకవణం స్థాపన చేస్తామని తెలిపారు. ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటున్నామన్నారు. తల్లులకు ఘనస్వాగతం పలుకుతామని... ఘనంగా సాగనంపుతామని మంత్రి సీతక్క వెల్లడించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గ్దదెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గ్దదెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి.

# ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు

- కసరత్తు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం
- జైలు వార్డర్లకు మొదలైన శిక్షణ



హైదరాబాద్,ఫిబ్రవరి22 : లోక్‌సభ ఎన్నికల కంటే ముందే తెలంగాణలో కొలువుల జాతర ప్రారంభం కానుంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే అన్ని నోటిఫికేషన్‌లు విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీకి సిఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. కొత్త నోటిఫికేషన్‌లకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం యత్నిస్తోంది. వారం రోజుల్లో 11 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. మరోవైపు సింగరేణి లోని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. 474 పోస్టుల భర్తీకి సింగరేణి అధికారులు కసరత్తు మమ్మరం చేశారు. నిన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సింగరేణి అధికారులు సమావేశం అయ్యారు. ఇప్పటికే 563 పోస్టులకు గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇకపోతే జైళ్ల శాఖలో కొత్తగా 136 మంది వార్డర్లు ఎంపికయ్యారు. గురువారం నుంచి చంచల్‌గూడ జైల్లో నూతన వార్డర్లకి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో 136 మంది వార్డర్లుగా ఎంపికయ్యారు. జైళ్ళ శాఖ ప్రధాన కార్యాలయానికి 85 మంది రిపోర్టు చేయగా.. వీరిలో ఏడుగురు మహిళా వార్డర్లు ఉన్నారు. వార్డర్లుగా ఎంపికైన వారికి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందించిన విషయం తెలిసిందే. చంచల్‌గూడ జైలు ఆవరణలో వార్డర్లకి జైళ్ళ శాఖ డీజీ సౌమ్యా మిశ్రా శిక్షణా కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.నూతన వార్డర్లందరికీ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా శుభాభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అనేది చిన్న విషయం కాదని తెలిపారు. సమాజంలో మీ సర్వీస్ ఇవ్వడానికి ముందుకు రావడం గర్వకారణమన్నారు. దేశంలో తెలంగాణ జైళ్ళ శాఖకు ఎంతో పేరు ఉందన్నారు. ఆ పేరును మరింత పెంపొందించడానికి అందరూ కూడా భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో అందరిని వజ్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. జైళ్ళకు వచ్చే ఖైదీలను కేవలం నేరస్తులుగానే కాకుండా మంచి పౌరులుగా తీర్చిదిద్ది సమాజంలోకి పంపిస్తామన్నారు. ఖైదీలతో ఎక్కువగా గడిపేది వార్డర్లు మాత్రమే అని.. అందుకే వాళ్ళని మెంటల్గా, ఫిజికల్గా ఫిట్గా ఉండేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల వార్డర్ల శిక్షణ చేసి పంపించామన్నారు. ఇప్పుడు మూడో బ్యాచ్ శిక్షణకు వచ్చిందన్నారు. ఈ శిక్షణ వార్డర్లకు అందరికీ పూర్తిస్థాయిలో ఉపకరిస్తుందని భావిస్తున్నామని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు.

# సిద్దిపేట అగ్నిప్రమాదంపై దర్యాప్తు

- వేగంగా పునరుద్ధరణ చర్యలు
- యధావిధిగా విద్యుత్ సరఫరా
- ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి పొన్నం

సిద్ధిపేట,ఫిబ్రవరి22 : సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. రైతులకు ఇబ్బందిలేకుండా వ్యవసాయానికి ఉదయం నుంచి కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. దురదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. మూడు రోజుల వరకు కరెంట్ రాదనుకున్నాం ..కానీ వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఇచ్చామన్నారు. సిద్దిపేట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం కారణంగా సిద్దిపేట పట్టణంతోపాటు పరిసర మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లకు కూడా మంటలు వ్యాపించడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హైదరాబాద్ నుంచి ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిని మంత్రి పొన్నం ప్రభాక్ సందర్శించారు. కారణానలు తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి త్వరగా పునరుద్దరణ చేపట్టాలన్నారు. సిద్దిపేటలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సబ్‌ష్టేన్‌లో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. పీటీఆర్ పేలిపోవడం వల్లే సబ్ స్టేషన్‌లో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మూడు అగ్నిమాపక యంత్రాలతో మంటలు ఆర్పామన్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. జరిగిన ప్రమాదంపై విచారణకు ఆదేశించామని మంత్రి చెప్పారు. కాగా, సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ ట్రిప్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే గతకొంతకాలంగా ప్రతి దానికి విమర్శలు చేస్తున్న బిఆర్‌ఎస్ తాజాగా ఈ ప్రమాదంపైనా విమర్శలకు దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సబ్ స్టేషన్ల నిర్వహణ కూడా సరిగా రావడం లేదని బీఆర్ఎస్ విమర్శిస్తే.. గత ప్రభుత్వంలో చేపట్టిన నాసి రకం పనుల వల్లే ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. ఈ ఘటనకు రాజకీయం రంగు పులుముకుంది. విద్యుత్ సరఫరా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శించాయి. కాంగ్రెస్ ను ఓడించిన సిద్ధిపేట ప్రజలను చీకట్లో మగ్గపెట్టి ఆ పార్టీ పగ తీర్చుకుంటోందంటూ హరీష్ రావు విమర్శలు గుప్పిస్తున్నారు. సిద్ధిపేట పట్టణంతోపాటు 5 మండలలాకు సరఫరా నిలిచిపోయిందంటూ మండిపడుతున్నారు. దాదాపు మూడు గంటల పాటు సబ్ స్టేషన్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి మాట్లాడిన హరీశ్ రావు తక్షణం హైదరాబాద్ నుంచి విచారణ బృందాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు సిద్ధిపేటకు చేరుకున్న తర్వాత వాళ్లతో మాట్లాడిన హరీశ్ రావు ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తక్షణం విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే అగ్ని ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయని వీటికి ఎవరూ కారకులు కారని కాంగ్రెస్ఎదురుదాడికి దిగింది. సబ్ స్టేషన్ లో అగ్ని ప్రమాదానికి కాంగ్రెస్‌కి సంబంధం ఏంటని వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్...రెండు నెలల క్రితం వరకు మీ పార్టీయే అధికారంలో ఉందని వారు ఎందుకు నిర్వహణ పట్టించుకోలేదని మండిపడింది. అగ్నిప్రమాదం జరిగిన ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ఇలాంటి చౌకబారు విమర్శలు ఏంటని మండిపడింది.

# జాహ్నవి మృతిపై న్యాయం జరిగేలా చూడాలి

## కేంద్రానికి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ సూచన



హైదరాబాద్,ఫిబ్రవరి22 :అమెరికాలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందులను తన వాహనంతో ఢీకొట్టి చంపిన అమెరికన్ పోలీస్‌పై సరైన ఆధారాలు లేవంటూ అమెరికా కోర్టు విడుదల చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో అమెరికా రాయబార కార్యాలయం వెంటనే జోక్యం చేసుకొని అమెరికా ప్రభుత్వ వర్గాలతో మాట్లాడి జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కేటీఆర్ కోరారు. విదేశాంగశాఖ మంత్రి డాక్టర్ జయశంకర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకొని, అమెరికా ప్రభుత్వంతో మాట్లాడి స్వతంత్రంగా ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనేక ఉన్నత లక్ష్యాలతో అమెరికా వెళ్లి ఈ ప్రమాదంలో చనిపోవడం అత్యంత విషాదకరమని.. ఆమెకి జరగాల్సిన న్యాయం జరగకుండా కేసు తేలిపోవడం అంతకన్నా బాధాకరమన్నారు. గత సంవత్సరం జనవరిలో సియాటెల్ నగరంలో కెవిన్ దేవ్ అనే పోలీస్ అధికారి 115 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న తన కారు ఢీకొనడంతో జాహ్నవి మరణించింది. అయితే ఆ సంఘటన జరిగిన వెంటనే పోలీస్ అధికారి జరిగిన ప్రమాదం గురించి బాధపడకుండా.. వర్ణ వివక్షతో మాట్లాడుతున్న వీడియో వెలుగు చూసింది. దీంతో ఆ పోలీస్ అధికారి కావాలనే ఢీకొట్టి చంపారని.. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

# గద్దెలపై కొలువుదీరిన సమ్మక్కసారలమ్మ

(మొదటిపేజీ తరువాయి)



పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు ఇప్పటికే చేరుకోగా.. సారలమ్మ రాకతో మేడారం దేవనగరిగా మారిపోయింది. కన్నెపల్లి కల్పవల్లి పాదస్పర్శతో మహాజాతర తొలిఘట్టం ప్రారంభమైంది. రెండేండ్ల ఎదురుచూపుల తర్వాత సమ్మక్క,సారలమ్మ బుధవారం గద్దెలకు చేరుకోవడంతో మేడారం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. కన్నెపల్లి- మేడారం దారంతా భక్తజనం ప్రణమిల్లింది. జంపన్నవాగు జన సందోహంతో పరవళ్లు తొక్కింది. తల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి స్వాగతించేందుకు మేడారం ఒళ్లంత కండ్లు చేసుకొని పులకించింది. మేడారం మహా జాతరలో తొలి ఘట్టం బుధవారం నిర్విఘ్నంగా పరిపూర్ణమైంది. కన్నెపల్లి నుంచి తరలివచ్చిన సారలమ్మ బుధవారం అర్ధరాత్రి గద్దెను అలంకరించింది. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలికారు. సారలమ్మను కనులారా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే కన్నెపల్లికి భక్తజనం పోటెత్తింది. సారలమ్మను తోడ్కొని వచ్చే ప్రధాన వడ్డె (పూజారి) కాక సారయ్య సహా ఆయనను అనుసరించే ఇతర వడ్డెలు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, మహారాష్ట్రలోని సిరోంచ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ, కోయ గిరిజనుల పూజా విన్యాసాలతో కన్నెపల్లి మార్మోగింది. పూజల తరువాత కన్నెపల్లి నుంచి 16 మంది ఆడబిడ్డలు సంప్రదాయం ప్రకారం డోలి విన్యాసాలతో తరలివచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క-సారలమ్మ కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంకవనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచే కన్నెపల్లి సారలమ్మ గుడి వద్ద డోలి విన్యాసాలు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారలమ్మ యువజన సంఘం బృందాల సారథ్యంలో కళా ప్రదర్శనలు కొనసాగాయి. అదే సమయంలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఇతర పూజారులు సారలమ్మ గుడిలో వారి ఆచార సంప్రదాయాలను ఆచరించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కన్నెపల్లి సారలమ్మ గుడి నుంచి మేడారంలోని గద్దెల వరకు తోడ్కొని బయల్దేరారు. కన్నెపల్లిలో ఇల్లిల్లూ తమ ఇంటి ఆడబిడ్డకు నీళ్లారగించి, చీరెసారె పెట్టి, కొబ్బరికాయలు కొడుతూ మంగళహారతులు పట్టారు. అక్కడినుంచి జంపన్న వాగుకు చేరుకోగా.. జంపన్న తన అక్క సారలమ్మ కాళ్లుకడిగి మేడారానికి సాగనంపారు. జంపన్నవాగు నుంచి బయల్దేరిన సారలమ్మ మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకోగా.. అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజుల వ్డడెలు ఘనస్వాగతం పలికారు. అక్కడ ముగ్గురు దేవతల ప్రతినిధులు వారి వారి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క కూడా చేరుకోవడంతో ఇక ప్రధాన ఘట్టంలో చివరి అంకం కూడా ముగిసింది. సమ్మక్క గద్దెకు చేరిందన్న వార్తతో జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోపతండాలుగా పరుగులు తీశారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అత్యంత నియమ నిష్ఠలతో పూజారులు అమ్మవార్లను గద్దెలపైకి చేర్చారు. కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారికి ఇరువైపులా జనం పోటెత్తారు. శివాలూగె శివసత్తుల పూనకాలతో జాతర మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ, ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సమ్మక్క,సారలమ్మకు నీరాజనం పలికారు. ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో దద్దరిల్లాయి. మేడారం జాతరలో అత్యంత ఉద్విగ్నతకు లోనయ్యే ఘట్టం సమ్మక్క ఆగమనం. గురువారం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి రావడంతో భక్తుల మొక్కులు అందుకుంటున్నది. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య సమ్మక్క తల్లిని గద్దెలపై ప్రతిష్ఠించారు.

# మోడీ విదేశాంగ విధానంతో అద్భుతాలు !

ఇటీవల ఓ అద్భుతం జరిగింది. ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలపై ఉరిశిక్షను తప్పించుకున్న జైలు పాలయిన 8మంది నేవీ అధికారులు అనూహ్యంగా స్వదేశం చేరుకున్నారు. ఇది ఎంత అద్భుతం అంటే మాటల్లో చెప్పలేం. దీనికి ప్రధాని మోడీ చేసిన కృషి అమోఘమనే చెప్పాలి. ఎందుకంటే ఉరిశిక్ష పడ్డవారిని జైలుశిక్షకు రప్పించారు. అక్కడి నుంచి ప్రభుత్వ క్షమాభిక్షతో విడుదల చేయించగలిగారు. ఇదంతా మోడీ ఛరిష్మాతో పాటు..విదేశాంగ విధానంలో భారీ విజయంగా చూడాలి. విదేశాంగ విధానంలో అనుసరించే వ్యూహాలు ఇలాంటి అద్భుతాలను ఆవిష్కరిస్తాయి. కరోనా తరవాత మన విదేశాంగ విధానం పూర్తిగా మారిపోయింది. ఇతర దేశాలకు ఆపన్న హస్తం అందించేలా మోడీ నిర్ణయాలు ఉంటున్నాయి. దుబాయ్‌లో అక్షరధామ్ నిర్మించడం కూడా ఓ విజయంగానే చెప్పుకోవాలి. ఇరుగుపొరుగు దేశాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే.. సర్వస్వతంత్రంగా మనగలగాలి. స్వాతంత్ర్యా నంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. అమెరికా వైపా..రష్యా వైపా అన్న గీతలు ఉండేవి. ఇప్పుడా గీతలు చెరిగి పోయాయి. మనం బలంగా ఉంటూనే..అందరికి అందుబాటులో ఉండాలన్న ఓ మహత్తర మంత్రాన్ని మోడీ చేపట్టారు. అన్ని దేశాలు కూడా భారత్‌లో దోస్తీ చేసేలా చేస్తున్నారు. ఒక్క పాక్, చైనాలు తప్ప మిగతా ప్రపంచం అంతా ఇదే ధోరణితో సాగుతున్నది. నిజానికి మోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించు కునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల తోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకుండా చేయడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణామాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు ఆయనకు బలంగా లభించాయని స్పష్టం అవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం, ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం, ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదు లుకోవ డానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మస్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. మరింతమందికి అమెరికా వెళ్లేందుకు వీసా నిబంధనలు సడలాలని సగటు భారతీయులు కోరుకుంటు న్నారు. అమెరికాలో అణు ఇంధన రంగం నుంచి కమ్యూనికేషన్, ఆరోగ్య రంగాల్లో భారతీయులే కీలక పాత్ర పోషిస్తుండడం మనకు గర్వకారణం. ఇదంతా అంతర్జాతీయంగా భారత్ శక్తి, ప్రాధాన్యత పెరిగిందనడానికి సంకేతంగా నిలుస్తుంది. రానున్న కాలంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ నిర్వహించబోయే కీలక పాత్రకు తాజాపరిణామాలు ఊపునిస్తున్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా, చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతిపెద్ద వినియోగ మార్కెట్,బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోక పోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు.

# మాఘమాసం ఎంతో పవిత్రం

## పౌర్ణమినాడు నదీ, సముద్ర స్నానాలకు శ్రేష్ఠం



తిరుమల,ఫిబ్రవరి22 : మాఘమాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. పుణ్యస్నానాలకు, పుణ్యక్షేత్రాల దర్శనానికి ఈ మాసం ఎంతో పవిత్రమైనది. అలాగే మాఘపౌర్ణమి నదీస్నానాలకు, సముద్ర స్నానాలకు మరీ ప్రత్యేకంగా చెప్పబడింది.ఈ మాసానికి పరిపోషకుడు మాధవుడు. 'మా అంటే మహాలక్ష్మీ. 'ధనుడు' అంటే భర్త. మాధవుడు అంటే లక్ష్మీదేవికి భర్త అని అర్థం. అందుకే శ్రీమహాలక్ష్మి కూడా ఈ మాసాన్ని ఎంతగానో ఇష్టపడుతుంది. లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన మాసం కనుక శ్రీవైష్ణవులకు ఈ మాఘమాసం ఎంతో ప్రధానమైనది. విద్యాధిదేవత, వాగ్దేవి, జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీదేవి ఈ మాఘమాసంలోనే శుద్ధ పంచిమినాడు జన్మించింది. అందుకే మాఘశుద్ధ పంచమిని 'శ్రీపంచమి' అని అంటారు. 'శ్రీ' అంటే లక్ష్మీదేవి అని అర్థం. మానవునకు అవసరమైన ఆరు సంపదలలోను విద్యాసంపద ఒకటి. కనుకనే శ్రీమహాలక్ష్మి 'శ్రీపంచమి'నాడు సరర్వతీదేవి రూపంలో భాసిస్తుంది. ఈ రోజునే తల్లిదండ్రులు తమ పిల్లలకు 'అక్షరభ్యాసం' జరిపిస్తారు. నిజానికి మకర సంక్రమణం జరిగినది మొదలు కుంభసంక్రమణం జరిగేవరకు మధ్య ఉండే మధ్యకాలమే 'మాఘమాసం'. పవిత్రస్నానాలు పౌష్య శుక్ల పూర్ణిమతో మొదలై మాఘశుక్ల పూర్ణిమటో ముగుస్తాయి. చాంద్రమానం అనుసరించేవారికి ఈ మాఘమాసం పౌష్య బహుళ అమావాస్యతో ప్రారంభమై మాఘ బహుళ అమావాస్యతో ముగుస్తుంది. ఈ మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడం విశేష పూర్వప్రదం. కానీ, ఈ యాంత్రిక జీవితంలో అది సాధ్యం కానీ పని తెలిసే ... కనీసం 'మాఘపూర్ణిమ' నాడైనా నదీస్నానం గానీ, సముద్రస్నానం గానీ చేస్తే మాఘమాసం మొత్తం పవిత్ర స్నానాలు చేసిన ఫలితం వస్తుందని పెద్దలంటారు. ఎందుకంటే మాఘపూర్ణిమను 'మహామాఘి' అని అంటారు. సంవత్సరంలో వచ్చే 12 పూర్ణిమలలోనూ 'మాఘ పూర్ణిమ' అత్యంత విశేషమైనది. ఈ 'మహామాఘి' శివ, కేశవులిద్దరికీ ప్రీతికరమైనది. అందుకే ఈ మాఘ పూర్ణిమ నాడు తప్పకుండా సముద్రస్నానం చేసితీరాలి. శివ, కేశవులిద్దరినీ ఆరాధించి తరించాలి. ఈ మాఘమాసంలోనే ఆరోగ్యప్రదాత అయిన సూర్యుడు సప్తమి తిథినాడు జన్మించాడు. అందుకే మాఘశుద్ధసప్తమి 'రథసప్తమి' పర్వదినం అయింది. లయకారుడైన పరమేశ్వరుడు లింగాకారంలో ఉద్భవించి మాఘ బహుళ చతుర్ధశిని 'శివరాత్రి' పర్వదినం చేశాడు. విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని సర్వమానవాళికి అందించిన భీష్మ పితామహుడు ఈ మాఘ శుద్ధ అష్టమినాడు పరమపదం చేరి, మాఘశుద్ధ ఏకాదశి 'భీష్మ ఏకాదశి' పర్వదినం చేశాడు. త్రిమతాచార్యులలో ఒకరైన 'మధ్వాచార్యుడు' ఈ మాఘశుద్ధ నవమినాడు వైకుంఠ ప్రాప్తి పొందాడు.ఉడిపి కృష్ణుని మనం చూడగలుగు తున్నామంటే అందుకు మధ్వాచార్యుని కరుణాకటాక్షమే కారణం. అందుకే మాఘశుద్ధ నవమిని 'మధ్వనవమి'గా పాటిస్తూ ఉడిపి క్షేత్రంలో ఎంతో కోలాహలంగా కృష్ణునికి విశేషమైన ఉత్సవాలు, వేడుకలు చేస్తారు.జ్యోతిషశాస్త్ర ప్రకారం ఈ మాసాన్ని 'కేతువు' పరిపాలిస్తూంటాడు. కేతువు జ్ఞానప్రదాత, మోక్షకారకుడు. కనుక ఈ మాసంలో కేతువు విశేష పూజలు అందుకుంటాడు. చాంద్రమానం ప్రకారం చంద్రుడు 'మఖ' నక్షత్ర మండలంతో కూడి వుండే మాసం కనుక ఈ మాసానికి 'మాఘమాసం అనే పేరు వచ్చింది. మాఘ అమావాస్య పితృకార్యాచరణకు ఎంతో ప్రధానమైన రోజు. ఆ రోజున పైతృకం చేస్తే పితృదేవతలు పదివేల సంవత్సరాల పాటు స్వర్గసుఖాలు అనుభవిస్తారని పురాణాలు చెబుతున్నాయి. సాధారణంగా గ్రహణకాలాలు, సంక్రమణాలు 'పైతృకాలకు' ఎంతో అనువైన కాలాలుగా భావిస్తారు. అయితే, ఆదివారం, అమావాస్య, శ్రవణనక్షత్రం, వ్యతీపాత యోగం అన్నీ ఒకేరోజున కలిసివస్తే దాన్ని 'అర్థోదయ పుణ్యకాలం' అంటారు. అది గ్రహణకాలం కన్నా గొప్పదని శాస్త్రాలు చెబుతున్నాయి. పైగా మాఘ అమావాస్య, శతభిష నక్షత్రంలో కూడి వుంటే మరింత విశేషమని ధర్మసింధువు చెబుతుంది. కనుక, ఈ మాఘ అమావాస్య నాడు పితృదేవతలను స్మరిస్తే, పుత్రధర్మాన్ని నిర్వర్తించిన వారిమౌతాం. సకల నదీ, నదాలు చివరకు సముద్రంతోనే సంగమిస్తాయి. కనుక, సముద్రస్నానం చేస్తే సకల నదులలోనూ స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుంది. ముఖ్యంగా సముద్రుడి ప్రత్యేకత ఏమిటంటే ... ప్రతినిత్యం సూర్యకిరణాలవల్ల, ఎంతో నీరు ఆవిరి అవుతున్నా సముద్రం యొక్క పరిమాణం తగ్గదు. అలాగే, ఎన్నో జీవనదులు తనలో కలుస్తున్నా సాగరుని పరిమాణం పెరగదు. స్థిరత్వం ఆయన ధర్మం.సాగరుడు సంతోశప్రదుడు. సంవత్సరంలో నాలుగుసార్లు సాగరస్నానం చేయాలనీ, అవి కూడా 'ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘపూర్ణిమ, వైశాఖ పూర్ణిమ'లలో చేయాలని, ఆలా సాగరస్నానాలు చేసినవారికి సముద్రుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేస్తాడని పురాణాలు చెప్పాయి. 'స్నానం బ్రాహ్మీ ముహూర్తాన్ని నదీస్నానానికి అనుకూల సమయంగా నిర్ణయించారు. సూర్యోదయకాలం నుంచి, సూర్యాస్తమయం వరకూ ప్రసరించే సూర్యకిరణాలలోని విద్యుచ్ఛక్తిని నదీజలాలు, సాగర జలాలు తమలో నిక్షిప్తం చేసుకుంటాయి. తన వెండి వెలుగులతో జగతిని జ్యోత్స్నామాయం చేసే చంద్రుడు తన కిరణాలలోని అమృతత్వాన్ని, ఔశదీ విలువలను నదీజలాలకు అనుగ్రహిస్తాడు. నీటిలో వుండే ఈ అద్భుతశక్తులు ... తిరిగి సూర్యకిరణాలకు పరావర్తనం చెంది అంతరించి పోతాయి. అందుకే సూర్యోదయానికి పూర్వమే స్నానం పూర్తి చేయాలనే నియమాన్ని విధించారు. మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడానికి వీలు కుదరకపోతే, మాఘమాసం చివరి మూడురోజులైనా పవిత్రస్నానాలు చేస్తే మంచి ఫలాన్ని పొందవచ్చు.

# కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు

- బిఆర్ఎస్‌ను అణచివేసేలా వ్యూహాలు
- క్షేత్రస్థాయి నుంచి నరుక్కువస్తున్న రేవంత్



హైదరాబాద్,ఫిబ్రవరి 22 : అటు నుంచి నరుక్కు వద్దాం అన్న రీతిలో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొదపెడాతమన్న రీతిలో రాజకీయాలు ఉండబోతున్నాయి. ఆ పార్టీని లేవకుండా చేయాడమే ప్రధాన వ్యూహంగా రాజకీయం నడుస్తోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో మూడో అబ్యర్థిగా పోటీ పెట్టాలన్న ఆలోచన ఉన్నా కాంగ్రెస్ ఎందుకనో మిన్నకుంది. బిఆర్ఎస్‌కు ఛాన్స్ ఇచ్చింది. వద్దిరాజు ఎంపిగా గెలుపొందారు. అవసరాన్ని బట్టి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఎప్పుడైనా అధికార పార్టీలో చేరడం ఖాయం. తాజా రాజకీయాల్లో అధికారంలో లేకుండా ఉండలేకపోతున్నారు. అధికార పార్టీలో ఎప్పుడు దుంకుదామా అన్న ఆత్రుతతో ఉన్నారు. అయితే గతానికి భిన్నంగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. చాలా దూకుడుగా ఉండే సిఎం రేవంత్ రెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఎందుకంటే వారు ఎప్పుడైనా పార్టీలో చేరుతారు. అందుకే జాగ్రత్తగా వెళుతున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకునేలా చేస్తున్నారు. ఎందుకంటే రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే గ్రామ స్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుంది. ఇదే వ్యూహంతో సిఎం రేవంత్ ఇప్పుడు ముందుకు సాగుతున్నారు. అందుకే కాంగ్రెస్ క్షేత్రస్థాయి రాజకీయం మారుతోంది. మరోపక్క, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం దృష్టి పెట్టిన కాంగ్రెస్ కూడా మునిసిపాలిటీలపై పట్టుకోసం అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో సగానికిపైగా మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలహీన పరిచేందుకు గతంలో బీఆర్ఎస్ ఏ ఎత్తుగడలు వేసిందో అవే ఎత్తులను హస్తం నేతలు ఇప్పుడు అమలు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాది గడువు ఉండడంతో మెజారిటీ పాలక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుందని గుర్తించవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థులు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గూటికి చేరడం చూశాం. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఈ సీన్ రివర్స్ అయ్యింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. గతంలో కాంగ్రెసను వీడి బీఆర్ఎస్‌లో చేరిన వారు కూడా సొంతగూటికి చేరుతున్నారు. మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు అధికమయ్యాయి. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ చేతిలో ఉన్న మునిసిపాలిటీ పాలకవర్గాలు ఒక్కొక్కటిగా హస్తగతం అవుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు వల్లనైతేనేమి, ఎక్స్ అఫీషియో ఓట్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల వల్లనైతేనేమి రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో 90 శాతానికి పైగా బిఆర్ఎస్ పార్టీకే దక్కాయి. దీంతో రాష్ట్ర స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకూ బీఆర్ఎస్ హవా నడిచింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. మున్సిపాలిటీల పాలకవర్గాలు అధికార పార్టీ బాట పడుతు న్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటిదాకా 34 మున్సిపాలిటీల పాలక వర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ్యులు అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇందులో 30 మున్సిపాలిటీల్లో పాలకవర్గ సమావేశాలు కూడా జరిగాయి. వీటిలో 15 మున్సిపాలిటీల్లో పాలకవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్లూ జారీ అయ్యాయి. తొమ్మిది మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగ్గా ఆరు మున్సిపాలిటీల్లో జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగిన 9 మున్సిపాలిటీలూ అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం అయ్యాయి. మహబూబ్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, భూపాలపల్లి, నాస్‌పూర్, మంచిర్యాల, నల్లగొండ, వేములవాడ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరగా.. జగిత్యాల, భువనగిరి, ఖానాపూర్, హుజూర్ నగర్, సుల్తానాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఇవి కాక మరో 20 మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. మరోపక్క, బీఆర్ఎస్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళుతున్నా రు. ఇవి హస్తగతం అయితే కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. ఎన్నికల ముందు దీనిని పూర్తి చేసుకుని తరవాత ఎమ్మెల్యేల వైపు చూడవచ్చన్నది కాంగ్రెస్ ఎత్తుగడగా ఉంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ కసరత్తు పూర్తి చేసే అవకాశం ఉంది.

# వీధికుక్కలకు తోడు కోతుల బెడద

- రాష్ట్రంలో ప్రధాన సమస్యలు
- పదిలక్షల వరకు కుక్కలు ఉనట్లు అంచనా
- గ్రామాల్లో కోతుల దాడితో ప్రజల బెంబేలు
- పిల్లలు,మహిళలు, వృద్దులు స్వేచ్ఛగా వెళ్లలేని పరిస్థితి

హైదరాబాద్,ఫిబ్రవరి22 : రాష్ట్రంలో వీధికుక్కల, కోతుల దాడులతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ రెండు కూడా అతిపెద్ద సమస్యగా మారయి. కోతుల కారణంగా ఊళ్లల్లో ఇంట్లో పెరట్లో పాదులు వేసుకోవడం కూడా ప్రజలు మానేశారు. పెరటితోటలు పెట్టడం లేదు. ఇళ్లల్లో చెట్లు పెంచడం లేదు. ఇంటిని ఆనుకుని ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. ఇవివుంటే...ఎక్కడ కోతులు వచ్చి వాలుతాయోనని భయపడుతున్నారు. అలాగే ఇళ్లకు గేట్లు బిగించారు. ఈ సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. పదేళ్ల పాలనా కాలంలో కోతులను అడవులకు తరలించడం ఎలా అన్న ఆలోచన చేయలేదు. ఏదైనా ఘటన జరిగి నప్పుడు హడావిడి చేయడం..తరవాత మిన్నకుండడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. అగ్నిప్రమాదాలు , బస్సుల ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, కాలువల్లో కొట్టుకు పోవడం, వీధికుక్కల బారిన పడడం, కోతులు దాడివంటి అనకానేక ప్రమాదాల సందర్భంగా జరుగుతున్న తీరు ఇందుకు నిదర్శనంగా చూడాలి. ప్రమాదాలు జరగ్గానే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం, మళ్లీ మరచి పోవడం..జరుగుతోంది. యథారాజా తథా ప్రజ అన్న చందంగా అధికారుల తీరు ఉంటోంది. అధికారులు అప్పటికప్పుడు హడావిడి చేయడం తప్ప మరోటి కానరావడం లేదు. ఎపిలో గ్యాస్ లీక్ ప్రమాదాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఒక అగ్ని ప్రమాదం తరవాత అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైదరాబాద్ నగరంలో కుక్కల దాడులు వరుసగా చూస్తున్నాం. నాలాల్లో పడి కొట్టుకుపోవడం చూస్తున్నాం. ఇవన్నీ నిర్మూలించదగ్గవే అయినా అధికారుల అలసత్వం కారణంగా అడుగు పడడం లేదు. ప్రధానంగా కుక్కల దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. కుక్కల నిర్మూలనలో అధికారుల నిర్లక్ష్యం తప్ప మరోటి కాదు. ఇదిలావుంటే నగరంలో దాదాపు 4 లక్షల 61 వేల కుక్కలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే వీటికి తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా మరో ఐదు లక్షలు ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉంటాయని తెలుస్తోంది. ఇందులో జర్మన్ షెఫర్డ్, డాబర్మెన్ లాంటిలాంటి భయంకరమైన కుక్కలు కూడా ఉన్నాయి. ఈ కుక్కలన్నీ వీధుల్లో తిరుగుతూ..సామాన్య ప్రజలకు భయ భ్రాంతులను కలిగిస్తున్నాయి. అలాగే కుక్కల దాడితో ప్రమాదాలు జరుగతున్న ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు చేస్తున్న ఖర్చు వల్ల ప్రభుత్వ ఖాజానా గుల్ల అవుతోందే తప్ప లక్ష్యం నెరవేరడం లేదని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కె. కాశీనాథ్ అన్నారు. దాడులు చేసి వీధి కుక్కలు బాలలను చంపిన ఘటనలు ప్రభుత్వ బాధ్యారాహిత్యానికి పరాకాష్టగా చూడాలి. గతంలో ఇలాంటి ఘటనలు ఉన్నాయి. కుక్కలు పరుగెత్తుకుని వస్తున్న సందర్భాల్లో టూవీలర్‌పై పోతూ కిందపడి దెబ్బలు తాకిన వారు, ప్రమాదాలకు గురయిన వారు అనేకులు ఉన్నారని కాశీనాథ్ అన్నారు. అలాగే నడకదారిలో ఇవి అడ్డగించి కరుస్తున్న కేసులు అనేకం ఉన్నాయన్నారు. పిల్లలు వీధుల్లో లేదా పార్కుల్లో స్వేచ్ఛగా ఆడుకునే పరిస్థితి నగరంలో లేదన్నారు. మహిళలు, వృద్దులు ధైర్యంగా రోడ్డుపై అడుగు పెట్టకుండా కుక్కలు అడ్డుకుంటు న్నాయని కాశీనాథ్ ఆవేదన చెందారు. ఇకపోతే వీధికుక్కలకు తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా రోడ్లపైనే మలమూత్రాలు పోయడం వల్ల వీధులు ఖరాబు అవుతున్నాయని, వాటిని క్లీన్ చేయడం పారిశుద్ధ్య సిబ్బందికి కూడా సమస్యగా ఉందన్నారు. కొందరు పెద్దపెద్ద విదేశీ కుక్కలను పెంచడం వల్ల కూడా అరుపులు, భయాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కుక్కల పెంపకందారులు నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే వాటిని మలమూత్రాలకు వదిలేస్తున్నారని అన్నారు. కుక్క పెంటను ఎత్తిపోయడం అన్నది యజమానుల బాధ్యత అయినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్ డాగ్స్‌కు లైసెన్స్ తప్పనిసరి చేసి, నిబంధనల మేరకు పెంచుతున్నారా అన్నది కూడా చూడాలని కాశీనాథ్ కోరారు. కుక్కల కోసం నగర శివార్లలో షెల్టర్లు ఏర్పాటు చేసి, స్టెరిలైజ్ చేయడం వల్ల మంచి ఫలితాలతో పాటు డాగ్ లవర్స్‌కు కూడా వాటిని రక్షించుకునే అవకాశం వస్తుందన్నారు. అయినతే నగరంలో ఉన్న వీధికుక్కల్లో 75 శాతం కుక్కలు అంటే 3 లక్షల20 వేల కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తి చేశామని బల్దియా వెటర్నరీ ఆఫీసర్లు చెబుతున్నారు. బల్దియాతో పాటు 5 ప్రైవేట్ ఏజెన్సీలతో ఒక్కో కుక్కకు రూ.1500 ఖర్చు చేస్తోన్నట్టు అధికారులు అంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 5 యానిమల్ కేర్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజూ 200 కుక్కలకు ఆపరేషన్ చేయిస్తున్నామని వెల్లడించారు. కంప్లయింట్ వచ్చిన చోటకు వెళ్లి కుక్కను తీసుకు వచ్చి ఆపరేషన్ చేస్తున్నం చేస్తున్నామని చెప్పారు. కుక్కల కోసం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన యానిమల్ కేర్ సెంటర్ చాలా అద్భుతంగా ఉందని, అలాంటిది దేశంలోనే ఎక్కడా లేదని బల్దియా స్పష్టం చేసింది. కుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత వాటి చెవికి ఒక మరక పెడతామని, ఆపరేషన్ పూర్తయ్యాక కుక్కలో ముందు ఉన్న ఆ కోపం, ఆవేశం ఉండవని –వెటర్నరీ అధికారులు చెబుతున్నారు. ఎండాకాలంలో చాలా కుక్కలకు చిరాకుతో దాడి చేసే అవకాశం ఉంటుందంటున్నారు. గతంలో కుక్క కరిచి బాలుడు చనిపోతే.. ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం కేవలం సారీ చెప్పి చేతులు దులుపుకుందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిగా ఉన్న నేటి సిఎం రేవంత్ ఆరోపించారు. కనీస సానుభూతి చూపని రాక్షస ప్రభుత్వం ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరంలో కుక్కల బెడద నివారణకు కార్యాచరణ రూపొందించాల్సన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. అలాగే కోతుల నిర్మూలనకు కూడా పెద్ద ఎత్తున కార్యాచరణ చేయాల్సి ఉంది.

# సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

## మంత్రి వేణుగోపాలకృష్ణ




రాజమహేంద్రవరం,ఫిబ్రవరి22 : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను, అనుబంధంగా వాలంటీర్ సేవా వ్యవస్థను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వాలంటరీలకు వందనం కార్యక్రమానికి మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర, పురస్కార అవార్డులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి అందజేశారు. అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా సేవా వజ్ర కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 30 వేల రూపాయల నగదు, సేవా రత్న కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 20 వేల రూపాయల నగదు, సేవా మిత్ర కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 15 వేల రూపాయల నగదును అందించి సత్కరించారు. కడియం మండలంలో 482 మంది వాలంటీర్లకు ప్రోత్సాహాన్ని అందించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి రాజ్ మనోజ్, వైసీపీనాయకులు గిరజాల బాబు,హాళయాదల సతీష్ చంద్ర స్టాలిన్, రాష్ట్ర దేవాంగ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, తడాల చక్రవర్తి, ఈలి గోపాలరావు, టేకి శ్రీనివాస్, దాసరి శేషగిరి, లావేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (23-02-24)_times of varha main (13-2).qxd 2/23/2024 12:34 AM Page 4



## రాబోయే పార్లమెంటు ఎన్నికల కోసం సెక్టోరల్ అధికారుల శిక్షణ ప్రారంభం

జగిత్యాల ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



రాబోయే పార్లమెంట్ ఎన్నికలు-2024ను దృష్టిలో ఉంచుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమీకృత భవనంలో గల సమావేశ మందిరంలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన సెక్టోరల్ అధికారులకి ఎన్నికల విధులు విధానాల గురించి శిక్షణ ప్రారంభమైంది. కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆదేశానుసారం అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోరుట్ల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ డాక్టర్ పడాల తిరుపతి పాల్గొని సెక్టరు అధికారుల విధివిధానాలు చేయదలచినవి, చేయకూడనవి ఎన్నికల కమిషన నియమావళి అనుసరించి నడుచుకోవాలని తమకు కేటాయించిన సెక్టర్ పరిధిలో గల పోలింగ్ స్టేషన్లో పరిశీలించి కనీస వసతులు, వల్నారబిలిటీ మ్యాపింగ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి పట్ల, ఉన్నతాధి కారులతో సమాచార లోపం లేకుండా సెక్టార్ మ్యాపింగ్ తో పాటుగా రూటు రూట్ ప్లాన్ తదితర అంశాలతో పాటుగా సమగ్ర నివేదికను రెండు రోజుల్లో రిటర్నింగ్ అధికారుల కు అందించాలని పేర్కొన్నారు. అనుమానాలు ఉన్న నివృత్తి చేసుకోవాలని, సెక్టార్ ఆఫీసర్ మాన్యువల్ ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లత పేర్కొన్నారు.

## అదనపు తరగతి గదులకై ఎమ్మెల్యేకు వినతి

సికింద్రాబాద్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హైస్కూల్ నూతన భవన నిర్మాణం కోసం రూ. 65 లక్షల అదనపు నిధులను మంజూరీ చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ కు హైస్కూల్ సాధన కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. గురువారం హెడ్మాస్టర్ మల్లికార్జున రెడ్డి తో కలసి కమిటీ సభ్యులు చంద్రశేఖర్, శేషగిరిరావు, నర్సింగ్ రావు లు ఎమ్మెల్యేను కలిసి, భవన నిర్మాణ నిధుల కోసం విజ్ఞప్తి చేయగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా ఇంచార్జీ మంత్రి, జిల్లా కలెక్టర్ కు స్కూల్ భవన నిర్మాణం కోసం సిఫార్స్ లేఖను రాశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లాపూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మల్లాపూర్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):

మల్లాపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో గురువారం ఉదయం సమయములో ఉమా మహేశ్వర్ రావు మెట్ పల్లి డి.ఎస్.పి. మల్లాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనికి చేశారు పోలీసు స్టేషన్ రికార్డ్స్ పరిసరాలను పరిశీలించి సిబ్బంధికి తగు సూచనలు ఇచ్చినారు, వారి వెంట కే. లక్ష్మి నారాయణ సిఐ మెట్ పల్లి, ఎస్సై కిరణ్ కుమార్ వెంట వున్నారు.

## బీసీ గురుకుల ప్రిన్సిపాల్ తాడూరి రవీందర్‌కు కేయూ డాక్టరేట్

హుజూరాబాద్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



హుజూరాబాద్ పట్టణంలో గల సైదాపూర్ బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ తాడూరి రవీందర్ కాకతీయ విశ్వ విద్యాలయం నుండి తెలుగు సాహిత్యం లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వీరి స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ. రవీందర్ జగిత్యాల జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కథా రచయిత కే.వి. నరేందర్ పై కె.వి. నరేందర్ రచనలు - పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్దాం త గ్రంథానికి గాను డాక్టరేటు ప్రధానం చేసినట్లు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణా ధికారి ప్రొఫెసర్ ఎస్. నరసింహాచారి తెలిపారు. తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రవీందర్ తన పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, మిత్రులు మరియు హుజూరా బాద్‌కు చెందిన పలువురు నాయకులు, కళాశాల సిబ్బంది ఆయనను అభినందించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముల్కనూర్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ బతుకమ్మ బండ వెళ్ళు దారిలో మోరి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినాడు. మృతి చెందిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియదు. మృతుడు తాపీ మేస్త్రి పనులు చేస్తున్నట్లు అనుమానం ఉంది. మృతి చెందిన వ్యక్తి కి సంబంధించిన ఏమైనా వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే స్థానిక ముల్కనూర్ పోలీస్ స్టేషన్ తెల్పగలరు. మృతుడు అందాద 40 సంవత్సరాలు వయసు కలిగి ఉన్నాడు. మృతుని యొక్క ఎత్తు 5 ఫీట్ల 5 ఇంచులు. మృతుడు బ్లూ కలర్ జీన్ పాయింట్, కాఫీ గోధుమ కలరు ఫుల్ షర్ట్ కలిగి ఉన్నాడు. గుర్తు పట్టీన వారు ముల్కనూర్ పోలీస్ స్టేషన్ ఈ 8712685012 , 8712685131 నంబర్లకు ఫోన్ చేయగలరు అని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ముల్కనూర్ తెలిపారు.

# భారత ప్రధాని మోదీకి గల్ఫ్ కార్మికుల బహిరంగ లేఖ

### గల్ఫ్ వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని వినతి

రామ కిష్టయ్య సంగన భట్ల

9440595494



గల్ఫ్ దేశాలలో 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని వారికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోడీకి గల్ఫ్ కార్మికుల పక్షాన మంద భీంరెడ్డి ఒక లేఖ రాశారు. గమ్యస్థాన గల్ఫ్ దేశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటూ స్వదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం పంపిస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సేవలను గుర్తించాలని కోరారు.

సౌదీ అరేబియా, యూఏఈ, ఓమాన్, కువైట్, ఖతార్, బహరేన్ ఆరు అరబ్ గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయ సంఘాల ప్రతినిధులతో జనవరి చివరి వారంలో దుబాయిలో సంప్రదింపుల సమావేశం నిర్వహించి గల్ఫ్ కార్మికుల కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, సామాజిక భద్రతా పథకాల గురించి చర్చించారు. భారత్ - గల్ఫ్ దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక కార్మిక ఒప్పందాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వానికి కొన్ని సూచనలు, కోరికలతో కూడిన నివేదిక తయారు చేశారు. "అహ్లాన్ మోడీ" బహిరంగ సభ, బాప్స్ హిందూ దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గల్ఫ్ ప్రాంతంలో పనిచేసే వలస కార్మికుల సంక్షేమానికి పథకాలు ప్రకటించాలని మంద భీంరెడ్డి ఆ లేఖలో కోరారు. ప్రవాసీ భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల ప్రమాద బీమా పథకంలో సహజ మరణాన్ని చేర్చాలని, ఈసీఆర్, ఈసీఎన్నార్ అనే రెండు రకాల పాస్ పోర్టు దారులకు బీమా సౌకర్యం కల్పించాలని, రెండు రకాల పాస్‌పోర్ట్ వర్గీకరణను రద్దు చేసి ఒకే రకం పాస్‌పోర్ట్ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ లోని భారతీయ వలస కార్మికులకు బీమా, పెన్షన్‌తో కూడిన సమగ్ర సామాజిక భద్రతా పథకాన్ని అమలు చేయాలని, వాపస్ వచ్చే వలసదారుల కోసం పునరేకీకరణ, పునరావాసం పథకాన్ని రూపొందించాలని, ఎమిగ్రేషన్ యాక్టు 1983 ని ఆధునికీకరించాలని, ద్వైపాక్షిక కార్మిక ఒప్పందాలను క్రమం తప్పకుండా సమీక్షించడానికి గల్ఫ్ దేశాలతో సంయుక్త కమిటీలను ఏర్పాటు చేయాలని, గల్ఫ్ దేశాల కంపెనీ యాజమాన్యాల నుంచి ఉద్యోగ అనంతర ప్రయోజనాలు (ఎండ్ ఆఫ్ సర్వీస్ బెనిఫిట్స్) పొందేందుకు న్యాయ సహాయాన్ని అందించాలని, విదేశాలకు ఉద్యోగం కోసం వెళ్లే వారందరికీ ముందస్తు ప్రయాణ అవగాహన శిక్షణ (ప్రీ-డిపార్చర్ ఓరియంటేషన్ ట్రైనింగ్ - పీడీఓటి ని నిర్బంధంగా అమలు చేయాలని, విదేశీ మారకద్రవ్యం పంపేవారికి బంగ్లాదేశ్ ప్రభుత్వం లాగా రెండున్నర శాతం ప్రోత్సాహకం అందించాలని, భారత దేశం నుంచి విదేశాలకు వెళ్లే ప్రతి పౌరుడి వివరాలను భారతీయ విమానాశ్రయాల్లో రిజిస్ట్రేషన్ చేయాలి. విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత దేశంలో చదువుకుంటున్న గల్ఫ్ కార్మికుల పిల్లలకు ఆయా విద్యా సంస్థలలో రిజర్వేషన్ కోటా అమలు చేయాలని, ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ పథకాలలో గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న కార్మికులు, గల్ఫ్ దేశాల నుంచి వాపస్ వచ్చి గ్రామాలలో ఉన్న వారిని లబ్ధిదారులుగా పరిగణించాలి. రేషన్ కార్డు లేదనే సాకుతో సంక్షేమ పథకాలకు వారిని దూరం చేయొద్దని టిపిసిసి ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సీనియర్ సీటీజన్ల సంక్షేమం కోసం కృషి

### జిల్లా సంక్షేమ అధికారిణి వాణిశ్రీ

జగిత్యాల ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



సీనియర్ సీటీజన్ల సంక్షేమం,వారి సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ అన్నారు.గురువారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారిణిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బి. వాణిశ్రీని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ ప్రతినిధులు కలిసి స్వాగతిస్తూ పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి మాట్లాడుతూ నిరాదరణకు, వేధింపులకు గురవుతున్న సీనియర్ సిటీజేన్స్ టోల్ ఫ్రీ నెంబర్.14567 కు ఫిర్యాదు చేయాలన్నారు. తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా జగిత్యాల,కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల లో సీనియర్ సిటీజేన్స్ కు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... వయోవృద్ధులను విస్మరిస్తే వారు శిక్షార్హులేనన్నారు. జిల్లా కలెక్టర్ షేఖ్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీవోలు సీనియర్ సిటీజేన్స్ కేసుల ను సత్వరం పరిష్కరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సంక్షేమ అధికారిణి వాణిశ్రీ కి తమ అసోసియేషన్ అన్ని విధాల సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, సీనియర్ సీటీజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి.సి. హన్మంత్ రెడ్డి, ఎం.డి. యాకూబ్, కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. ఆశోక్ రావు, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పి. సతీశ్ రాజ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### అవగాహన సదస్సు పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



వర్ధన్నపేట ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):

సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు పోస్టర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు, సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లిన పని చేయించుకోవడం తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005 తేదీన ఈ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని ఉపయోగించుకొని ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రతి భారత పౌరుడు సామాజిక బాధ్యతగా అవినీతి అక్రమాలను నిరోధించడానికి పేద ప్రజలకు ఆర్టీఐ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్రవంతి, వరంగల్ జిల్లా కన్వీనర్ నామిండ్ల హరీష్, అక్కెల్లి పవన్ కళ్యాణ్, సిలువేరు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ గౌరవ వేతనాలకై ఎమ్మెల్సీ కి వినతి

జగిత్యాల ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):

అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ డిసెంబర్ 2023 నుండి ఫిబ్రవరి 24 వరకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని మరియు సమ్మెకాలం వేతనం కూడా బి ఆర్ ఎస్ ఇచ్చిన హామి మేరకు ఇంతవరకు సమైకాలం వేతనం కూడా రావడం లేదు. ఆరోగ్య లక్ష్మి (బిల్లులు సకాలంలో రావడం లేదు. ఎలక్షన్ బకాయిలు 3.1-0 కి ఇవ్వ వలసిన గౌరవ వేతనం కూడా ఆఫీస్ 3) ఇంకా యొక్క జమ కావడం లేదు. అంగనవాడి టీచర్సకి కనీస వేతనం 26,000 పెంచి ఈపిఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పించగలరు రిటైర్ మెంట్ బెనిపిట్స్ 'టిచరికి రెండు, ఆయాకి ఒక లక్ష రూపాయల జీవో ని వెంటనే అమలు పరుచగలరని దయచేసి మా సమస్యలు, బాదలు అర్థం చేసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగలరని విన్నపము చేసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు.



## వ్యాసరచన పోటీల్లో బహుమతుల ప్రధానం

మెట్ పల్లి ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



వ్యాసరచనాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని మెట్ పల్లి ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ అన్నారు. సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో సత్యసాయి సేవలు వెల కట్టలేనివి అని అన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పాత్రలు, మెమోంటో లు ప్రధానం చేశారు. అనంతరం ఆర్డీవోకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ర్యాగాల్ల ఎలయేశ్వర్, బాస శ్రీనివాస్, వివిధ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జగిత్యాల రూరల్ ఎంపిడిఓ గా నూతనంగా భాద్యతలు చేపట్టిన నీర్ల రమాదేవి. ఈ సందర్భంగా పల్లెల అభివృద్ధికి, పారిశుధ్యానికి, వేసవిలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని అన్నారు ఎమ్మెల్యే.







జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో గద్దెలపై చేరిన సమ్మక్క, సారలమ్మ, పడిగిద్ద రాజులు. దర్శనం చేసుకున్న భక్తజనం. కోరిన కోర్కెలు తీర్చేతల్లులని తమ మొక్కులను మొక్కుకొని , తల్లులకు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారని ఫౌండర్ పడాల రవీందర్ తెలిపారు.


prajamantalau daily pages (23-02-24)_times of varha main (13-2).qxd 2/23/2024 12:34 AM Page 5



# పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు

## ఫిబ్రవరి 23, అన్నమాచార్య వర్ధంతి

రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494





దక్షిణ పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు, తెలుగు సాహితీ చరిత్రలో ప్రథమ వాగ్గేయ కారుడు అన్నమాచార్యుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడంలో నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టాడు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి.

"సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వ్మాయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

# ఈ ప్రాంత కరువును పారద్రోలే విధంగా అందరూ సహకరించాలి

- వేలేరు అభివృద్ధి ప్రధాత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- పీచర సమ్మక్కను మరింత అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**వేలేర్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):** వనదేవతల ఆశీస్సులతో ఈ ప్రాంత కరువును దూరం చేయడానికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని వేలేరు ప్రాంత వాసి, మండల అభివృద్ధి ప్రధాత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం వేలేరు మండలం పీచర గ్రామంలోని సమ్మక్క సారలమ్మలను ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....అమ్మవారి ఆశీర్వాదంతో వేలేరు మండలంలోని కొంత ప్రాంతానికి సాగునీరు వచ్చిందన్నారు. గతంలో కరువు నెలకొన్న ఈ ప్రాంతంలో ఈ సమయానికి పశువులకు త్రాగునీరు కూడా దొరికేది కాదన్నారు. కానీ ఇప్పుడు రెండు పంటలకు సరిపోయే విధంగా పైపు లైన్ ద్వారా సాగునీరు తెచ్చుకున్నమని అన్నారు. వచ్చే జాతర సమయం వరకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలందరికి ఉపయోగపడే పని కోసం పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... వచ్చే మేడరాం జాతర వరకు పీచర సమ్మక్క జాతర ను మరింత గొప్పగా అభివృద్ధి చేస్తానని అన్నారు.

## ఎరువుల విక్రయ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

### జిల్లా వ్యవసాయ అధికారిణి బి. వాణి



**జగిత్యాల ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):** నిబంధనలు అతిక్రమించి ఎరువుల విక్రయాలు జరిపితే వారిపై చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారిణి బి. వాణి హెచ్చరించారు. గురువారం జగిత్యాల అర్బన్ మండల కేంద్రంలో ఏ ఆర్ ఎస్ కె , వివిధ దుకాణాలను తనిఖీలు చేసిన వ్యవసాయ అధికారిణి వాణి అందులో భాగంగా విక్రయ కేంద్రాల యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు దుకాణాలలో స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి ఎరువుల క్రయ విక్రయాల వివరాలు నమోదు చేయాలన్నారు. లైసెన్స్ కాఫీలని విక్రయ కేంద్రాలలో ప్రదర్శనగా గోడకు అమర్చాలని, విక్రయించే ఎరువులకు సంబందించిన "ఓ "ఫామ్ లను తమ లైసెన్స్ లో నమోదు చేసుకోవాలని ఆమే సూచించారు. ధరల పట్టిక ప్రతి రైతుకి కనిపించే విధంగా అమర్చడంతో పాటు ప్రతి రోజు ఎరువుల నిల్వలను , రోజు వారి అమ్మకాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులను అమ్మరాదని, రైతులకు కొనుగోలు రశీదు నీ ఫామ్ ఎం రూపకంగా ఇవ్వాలని,ఎరువుల అమ్మకాలను ఈ పాస్ , బయో మెట్రిక్ పద్ధతిన విక్రయాలు జరపాలని వాణి దుకాణాధారులకు సూచించారు. ప్రతి నెలలో క్రయ విక్రయాల వివరాలు జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి బి.వినీల , వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్వాకోడూరులో సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలు



**గొల్లపల్లి ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలలో చిల్వాకోడూరులో సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల భాగంగా గురువారం కోయ పూజారి జాతర నిర్వాహకుల ఆధ్వర్యంలో డప్పు చప్పుల మధ్య సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చారు. జాతరకు చేరుకున్న భక్తులు బెల్లం సమర్పించి తమ మొక్కలు చెల్లించుకున్నారు.

## 15 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం పట్టివేత

### ముగ్గురి పై కేసు నమోదు

**మల్లాపూర్ ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల కేంద్రంలోని 08:00 గంటల సమయములో పెట్రోలింగ్ చేయుచుండగా సిర్పూర్ గ్రామ శివారు వద్ద అనుమానాస్పధంగా ఒక బోలెరో వాహనం బిఎన్ఓ ఏపీ 16టీజీ7036, గల అట్టి వాహనమును ఆపి తనికి చేయగ అంధులో 15 క్వింటాళ్ళ పిడియస్ బియ్యం ధోరికినవి, వెంటనే వాటిని పట్టుకొని అట్టి బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురి పై కేసు నమోదు చేయడమైనదని ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

## మన్నం వెంకటరమణ గుండెపోటుతో మృతి

**అమరావతి,ఫిబ్రవరి22:** టిడిపి నేత, ఎన్నారై మన్నం వెంకటరమణ (53) గుండెపోటుతో మరణించారు. అమెరికాలోని న్యూజెర్సీ నుంచి విమానంలో హైదరాబాద్ కు వస్తుండగా.. ఆయన గుండెపోటుకు గురయ్యారు. గ్రీస్ ఏథెన్స్ విమానాశ్రయంలోని ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. కాగా..వెంకటరమణ 2009 అసెంబ్లీ ఎన్నికలలో ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 53 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి.ఆ తర్వాత అమెరికాలోని వివిధ జాతీయస్థాయి తెలుగు సంఘాల్లో కీలక పాత్ర పోషించారు. దశాబ్దాల క్రితమే ఆయన అమెరికాలో స్థిరపడ్డారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)లోనూ ఆయన యాక్టివ్ గా పనిచేసేవారు. ఇండియా నుంచి అమెరికాకు వెళ్లిన వారికి న్యూజెర్సీలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి.. తన ఉదారతను, గొప్ప మనసును చాటుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. న్యూజెర్సీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆయన గుండెపోటుకు గురవ్వడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆరోగ్యం విషమించి మరణించినట్లు వైద్యులు తెలిపారు. వెంకటరమణ మృతితో టిడిపిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బటీటీడీ తరహాలో శ్రీశైలానికి స్వయంప్రతిపత్తి కల్పించాలి

### 23వ ట్రస్ట్ బోర్డ్ సమావేశంలో తీర్మానం

**అమరావతి,ఫిబ్రవరి22:** శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ సమావేశంలో కీలక తీర్మానం చేశారు.. శ్రీశైల దేవస్థానం పరిపాలన భవనంలో ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో 23వ ట్రస్ట్ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సమావేశం సుమారు 4 గంటలపాటు కొనసాగింది. అనంతరం మొత్తం 50 ప్రతిపాదనలను ప్రవేశపెట్టగా 49 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి 1 వాయిదా వేశారు.. అయితే, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో శ్రీశైలం దేవస్థానానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరుతూ దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించామని వెల్లడించారు ఆలయ చైర్మన్ చక్రపాణి రెడ్డి.. అలాగే శ్రీశైలంలో భక్తులు, స్థానికుల కోసం సుమారు 19 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఆమోదం తెలిపారు. కర్నూలు నగరంలోని దేవస్థానం సమాచార కేంద్రం వద్ద కళ్యాణ మండపం, వాణిజ్య సముదాయానికి రూ.8 కోట్ల 60 లక్షలకు ఆమోదించారు. వీటితోపాటు సున్నిపెంటలో నిర్మిస్తున్న సిబ్బంది వసతిగృహాలకు నీటి సరఫరాకి ఏర్పాటుకు అంచనా వ్యయం రూ. 15 కోట్లు ఆమోదించారు. క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా సూపరింటెండెంట్ ఇంజనీరు పోస్ట్ ఏర్పాటుకు దేవాదాయశాఖకు ప్రతిపాదనలకు తీర్మానించారు. అలానే దేవస్థానంలో క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని తీర్మానించామని ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి మీడియాకు తెలిపారు.

## ఒంగోలును నేడు సిఎం వైఎస్ జగన్ పర్యటన

### 25 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం



**అమరావతి,ఫిబ్రవరి22:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేడు ప్రకాశం జిల్లా ఒంగోలులో పర్యటించనున్నారు.. ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు సీఎం జగన్.. ఇక, ఒంగోలు పర్యటన కోసం.. రేపు ఉదయం 9.40 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరనున్న ఆయన.. ఉదయం 10.20 గంటలకు ఒంగోలులోని అగ్రహారం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.30 ఒంగోలు తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. 11.25 నుంచి 12.25 వరకు సీఎం జగన్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.45 గంటలకు తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా 25 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తారు. గత కొద్ది కాలంగా పెండింగ్ పడుతూ వస్తున్న ఒంగోలు పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిచేశారు. ప్రభుత్వం తొలివిడత 70 కోట్ల నగదును విడుదల చేసింది.. అయితే, ఆ తర్వాత రెండవ విడత నగదు విడుదలలో జాప్యం జరగటంతో ఒంగోలులో వైసీపీ పట్టాలు ఇవ్వలేదని పెద్దఎత్తున టీడీపీ విమర్శలకు దిగింది.. దీంతో సీరియస్ గా తీసుకున్న బాలినేని.. పలుమార్లు సీఎం జగన్ ను కలసి పరిస్థితి తీవ్రతను వివరించారు.. 25 వేల మందికి పట్టాలు పంపిణీ చేయలేక పోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని కూడా ప్రకటించారు.. దీంతో సీఎం జగన్ పట్టాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ప్రభుత్వం ఒంగోలులో పేదలకు పట్టాలు పంపిణీ చే సేందుకు అవసరమైన భూసేకరణకు, లే అవుట్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం 231 కోట్లు మంజూరు చేసింది.గతంలో చెప్పినట్టుగానే ఇప్పటికే పేదలకు పంపిణీ చేసేందుకు పట్టాలను కూడా సిద్దం చేశారు. సీఎం జగన్ చేతులు మీదుగా ఒంగోలులో అర్హులైన ప్రజలందరికి ఇళ్ల పట్టాలు అందించనున్నారు. మరోవైపు ఒంగోలు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 350 కోట్ల రూపాయల ప్రాజెక్టును కూడా సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో నగర ప్రజల దాహార్తి కూడా తీరనుంది.. ప్రాజెక్టు పూర్తయితే ఒంగోలు ప్రజలకు ప్రతీరోజు తాగునీరు అందించే అవకాశం ఉంది.. సీఎం జగన్ పర్యటనకు సంబంధించి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.. భారీ ఎత్తున ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. పోలీసులు సీఎం పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## మంత్రి ధర్మానపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

**అమరావతి,ఫిబ్రవరి22:** మంత్రి ధర్మాన ప్రసాదరావుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది తెలుగుదేశం పార్టీ.. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనవచ్చు అంటూ మంత్రి ధర్మాన చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ.. ఎన్నికల సంఘానికి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది.. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో ఉండరాదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని.. ఎన్నికల సంఘం ఆదేశాలను అధికార పార్టీకి చెందిన నాయకులు యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారంటూ ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో పేర్కొన్నారు టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు.. ప్రభుత్వానికి అనుకూలంగా వాలంటీర్లు ప్రచారం చేయాలని మంత్రులే బహిరంగంగా చెబుతున్నారని.. వృద్ధులు, వికలాంగుల పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల్లో వాలంటీర్ల ప్రమేయం లేకుండా ఎన్నికల సిబ్బందికి ఆదేశాలివ్వాలని ఈసీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.. వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని సీఈవో, డీఈవో, ఆర్వోలకు ఈసీ స్పష్టం చేయాలి.. మంత్రి ధర్మాన ప్రసాదరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో ఎన్నికల సంఘాన్ని కోరారు అచ్చెన్నాయుడు.కాగా, శ్రీకాకుళం జిల్లాలో వాలంటీర్ సేవలకు పురస్కారాల ప్రదానోత్సవంలో కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు.. వాలంటీర్ కూడా మీకు ఇష్టమైన వారికి ఓటు వేయాలని చెప్పే హక్కు ఉంది. ఏ ప్రభుత్వం కన్నీరు తుడిసిందో , ఏ ప్రభుత్వం ఆకలి తీర్చిందో చెప్పాలి అని పిలుపునిచ్చారు. ఇక, ఏ వృద్ధుడు ఇతర పార్టీలకు ఓటు వేయరన్న ఆయన.. వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఉంది, దానిని వినియోగించమని చెప్పండి. మీరే దగ్గరుండి పోస్టల్ బ్యాలెట్ అప్లై చేయండి అని సూచించారు. వాలంటీర్ కి సర్వీస్ రూల్స్ ఏం లేవని వ్యాఖ్యానించారు. అవసరం అయితే వాలంటీర్ ఏజెంట్ గా కూర్చోవలసి ఉంటుందన్నారు ధర్మాన. ఏరకమైన ప్రతిఫలం ఆశించని వ్యక్తులు వాలంటీర్లు అని అభివర్ణించిన ఆయన.. ఏ వృత్తి అయినా పదిమంది గుర్తిస్తేనే సంతృప్తి లభిస్తుందన్నారు. అయితే, ధర్మాన కామెంట్లపై సీరియస్‌గా రియాక్ట్ అయిన టీడీపీ.. ఆ వ్యవహారాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది.

prajamantalau daily pages (23-02-24)_times of varha main (13-2).qxd 2/23/2024 12:34 AM Page 6



## ఎన్టీఆర్‌తో నటించాలని ఉందన్న శ్రీశాంత్



సినిమాతో యంగ్ టైగర్ ఎన్టీఆర్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కొమరం భీంగా అద్భుత నటన కనబర్చి గ్లోబల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాడు విదేశాల్లోనూ ఎన్టీఆర్ కి భారీ స్థాయిలో అభిమానులు ఉన్నారు. ఇక ఎన్టీఆర్ ఫ్యాన్స్ జాబితాలో క్రికెటర్స్ కూడా ఉన్నారు. తాజాగా మరో క్రికెటర్ అయితే ఏకంగా ఎన్టీఆర్ తో నటించాలని ఉందంటూ తన మనసులో కోరికను బయటపెట్టాడు. టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ తాజా ఇంటర్వ్యూలో జూనియర్ ఎన్టీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తారక్ పై తనకున్న అభిమానాన్ని చూపుతూ తాజా ఇంటర్వ్యూలో శ్రీశాంత్ చేసిన కామెంట్స్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. ఈ మేరకు శ్రీశాంత్ మాట్లాడుతూ..' ఎప్పటికైనా ఎన్టీఆర్ తో నటించాలని ఉంది. ఎన్టీఆర్ నటన అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డాన్స్ కి నేను పెద్ద ఫ్యాన్ ని. గతంలో ఒకసారి నేను ఎన్టీఆర్ ని కలిసాను. ఆ సమయంలో ఆయనతో మాట్లాడాను. మీరు బాగా డాన్స్ చేస్తారు అని చెప్పాను. దానికి ఆయన థాంక్స్ చెప్పడంతో పాటు సరదాగా లయింగ్ కిస్ కూడా ఇచ్చారు. ఎన్టీఆర్ ని చూస్తే ఎంతో మోటివేట్ గా ఉంటుంది. నేను ఎన్టీఆర్ ని కలిసిన ఈవెంట్లో అల్లు అర్జున్ కూడా ఉన్నారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఒకప్పుడు ఇండియన్ బెస్ట్ బౌలర్స్ లో ఒకరిగా పేరు తెచ్చుకున్న శ్రీశాంత్ క్రికెట్ నుంచి రిటైర్డ్ అయిన తర్వాత 2017లో సినీ ఆరంగేట్రం చేశాడు. 'అక్సర్ 2' సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత కొన్ని సౌత్ సినిమాల్లో నటించాడు. చివరగా 'కాతువాకుల రెండు కాదల్' సినిమాలో కనిపించాడు. ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు కొన్ని సౌత్ సినిమాల్లో నటిస్తున్నాడు.

## విడుదలకు సి202 హారర్ చిత్రం రెడీ

మైటీ ఒక్ పిక్చర్స్ పతాకం పై తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం 'సి 202'. మున్నా కాశి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ హర్రర్ థ్రిల్లర్ చిత్రానికి మనోహరి కె ఎ నిర్మాత. పూర్తి సినిమా రాత్రిపూట చిత్రీకరించబడిన ఈ సినిమా.. ప్రస్తుతం షూటింగ్ అంతా పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలలో బిజీగా ఉంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ విశేషం ఏమిటంటే.. ఒక్క డైలాగ్ కూడా లేకుండా ముఖ్య తారాగణాన్ని చూపిస్తూ.. కేవలం సౌండ్ ఎఫెక్ట్స్‌తో ఉండటం. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉండటమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. ట్రైలర్ విడుదల సందర్భంగా దర్శకుడు, హీరో అయిన మున్నా కాశి మాట్లాడుతూ.. 'సి 202' ఒక వైవిధ్యమైన కథతో తెరకెక్కించాం. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ చూస్తే అందరికీ అది అర్థమవుతుంది. ఒక డైలాగ్ కూడా లేకుండా క్యారెక్టర్‌లను చూపిస్తూ సౌండ్ ఎఫెక్ట్స్‌తో.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సినిమాపై ఇంట్రస్ట్ కలిగించేలా ట్రైలర్‌ని కట్ చేశాం. ఈ ట్రైలర్‌ని 'సౌండ్ ఆఫ్ సి 202' అని పిలుచుకుంటున్నాము. ఈ ట్రైలర్‌ని మంచి సౌండ్ సిస్టమ్‌తో చూడండి, ఖచ్చితంగా సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతుంది. సినిమా విషయానికి వస్తే.. 'సి 202' చిత్రం ఆద్యంతం రాత్రిపూట చిత్రీకరించబడింది. కథ, స్క్రీన్‌ప్లే చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాను అద్భుతమైన సస్పెన్స్, భయపడే హారర్ సన్నివేశాలతో.. మంచి థ్రిల్లింగ్ ఎపిసోడ్స్‌తో చిత్రీకరించాము. షూటింగ్ అంతా పూర్తయింది. ప్రస్తుతానికి రామానాయుడు స్టూడియోస్‌లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సాంకేతికంగా మేము హై-ఎండ్ కెమెరాలను మరియు మంచి లైటింగ్ పరికరాలను ఉపయోగించాము. ఈ సినిమాలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ వంటి సీనియర్ నటులు ప్రధాన పాత్రలు పోషించారు. వీరంతా ఇప్పటి వరకు చేయని పాత్రలో నటించి ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నారు. ఈ చిత్రంలో 21 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయి. అవన్నీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తాయి.. త్వరలోనే చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

## శ్రీవిష్ణు కొత్త చిత్రం ఓం భీమ్ బుష్



యంగ్ హీరో, కథల విషయంలో ఆచితూచి అడుగేసే శ్రీవిష్ణు సరికొత్త మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. గత సంవత్సరం 'సామజవరగమన' చిత్రంతో విజయం అందుకున్న ఆయన మరో హిలేరియస్ కామెడీ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నారు. 'బోచేవారెవరురా' చిత్రం తర్వాత శ్రీవిష్ణు , ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ మరోసారి కలిసి నటించడం విశేషం. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల్లో యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌పై ఓ చిత్రం రూపొందుతోంది. హర్ష కొనుగంటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్ ఖరారు చేశారు. 'నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్' అనే క్యాప్షన్ ఇచ్చారు. తాజాగా ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఓం భీమ్ బుష్ పేరు వినగానే ఏదో మంత్రం చదివినట్లు అనిపిస్తోంది. పోస్టర్ చూస్తే శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ వ్యోమగాముల పాత్రలు పోషించినట్లు తెలుస్తోంది. బ్రోచేవారెవరురా సినిమాతో హిట్ కొట్టిన ఈ ముగ్గురు మరోసారి నవ్వించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 22న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# మహేశ్ బాబుకు కొత్తగా మేకోవర్

## కొత్త సినిమా షూట్‌తో రాజమౌళి ఆంక్షలు



కొత్త సినిమా కోసం మహేశ్ బాబును కొతత్గా చూపాలని స్టార్ డైరెక్టర్ రాజమౌళి యోచిస్తున్నారు. అందుకోసం మహేశ్ బాబును కేవలం షూటింగ్‌కే పరిమితం చేయాలని, బయట కనపకుండా చూడాలిన అనుకుంటున్నాడట. అందుకే అతను ఇక పబ్లిక్ గా కనిపించరాదని ఆంక్షలు పెట్టారని టాక్ నడుస్తోంది. మహేష్ బాబు ఎలాంటి ఈవెంట్స్ కు కానీ, మూవీ ఫంక్షన్స్ కు హాజరుకాకూడదని ఆదేశాలు జారీ చేశారట. ఇప్పుడు ఇదే న్యూస్ టాలీవుడ్ లో చక్కర్లు కొడుతుంది. ఇకపై మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించకూడదని ఎస్ఎస్ రాజమౌళి చెప్పి నట్లు టాక్ వినిపిస్తుంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్స్ లో సినిమా రాబోతున్న విష యం తెలిసిందే.. ఈ సినిమా కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూ స్తున్నారు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా పాత్ర కోసం మహేష్ బాబు గెటప్ మార్చనున్నారు. అలాగే బాడీ బిల్డింగ్ కూడా చేయబోతున్నాడు. ఆయన కొత్త గెటప్ ఎలా ఉంటుందో జనాలకు తెలియకూడదు. అందుకే మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించవద్దని రాజమౌళి రూల్ పెట్టారని టాక్. మిగతా దర్శకులతో పోలిస్తే రాజమౌళి వర్క్ స్టైల్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. జక్కన్న సినిమాలు తీయడానికి చాలా సమయం తీసుకుంటాడు. అందుకు తగ్గట్టుగానే హీరోల లుక్స్ ను కూడా మార్చేస్తుంటారు ఇప్పుడు మహేష్ బాబు లుక్ ను కూడా మారుస్తున్నారట దర్శకుడు రాజమౌళి. అందుకు తగ్గట్టుగానే మహేష్ బాబు విదేశాలకు వెళ్లి మరీ శిక్షణ పొందుతున్నాడు. మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమా హిట్ అయినా కూడా అది మహేష్ బాబు అభిమానులకు ఆశించిన స్థాయిలో కిక్ ఇవ్వలేకపోయింది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే గ్రేట్ మూవీగా నిలవనుంది. రాజమౌళి ఈసారి తన టెక్నికల్ టీమ్ లో కొన్ని మార్పులు చేయనున్నాడని అంటున్నారు. దాంతో సినీవర్గాల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది.

# డిఫరెంట్‌గా గీతాంజలి మళ్లీ వచ్చేసింది

## శ్మశానంలో టీజర్ లాంచ్ కార్యక్రమం



ఈమధ్య సినిమాల ప్రచారాలు కొంచెం విచిత్ర ధోరణిలోనే వెళుతున్నాయని చెప్పుకోవచ్చు. 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా చిత్ర నిర్వాహకులు కూడా వైవిధ్యంగా ఉండటం కోసమని ఏకంగా శ్మశానవాటికలోనే తమ సినిమా టీజర్ లాంచ్ చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. ఈ శనివారం రాత్రి 7 గంటలకు బేగంపేట్ స్మశాన వాటికలో 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' టీజర్ లాంచ్ చేస్తున్నాం అని ఆ చిత్ర పీఆర్ మీడియా వాళ్ళకి మెసేజ్ లు పంపాడు. ఈ 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా ఇంతకు ముందు విడుదలై ఘన విజయం సాధించిన 'గీతాంజలి' కి సీక్వెల్ గా వస్తోంది. ఇందులో అంజలి ప్రధానపాత్రలో నటించింది. శివ తుర్లపాటి దీనికి దర్శకుడు, కోన వెంకట్ కథని సమకూర్చారు, ఈ సినిమా నిర్మాణంలో కూడా భాగం అయ్యారు. ఇంకా ఇందులో శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, సత్య, షకలక శంకర్, బ్రహ్మాజీ, రవి శంకర్, రాహుల్ మాధవ్ ఇంకా చాలామంది నటీనటులు నటించారు. ఈ సినిమా నటి అంజలికి 50వ సినిమా కావటం ఆసక్తికరం. ఈసారి ప్రచారాలు వినూత్నంగా ఉండాలని చిత్ర నిర్వాహకులు అనుకున్నారేమో, అందుకని ఈ చిత్ర ప్రచార చిత్రాలు బేగంపేట లోని స్మశానవాటికలో చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. సినిమా నేపథ్యం హర్రర్ అవటం, ఇందులో దెయ్యాలు, ఆత్మలు లాంటివి ఉండటం మూలాన, స్మశానంలో ప్రచారం చెయ్యాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

## ఐపీఎల్ 2024కు షమీ దూరం



ఐపీఎల్ 2024 మార్చి 22 నుండి ప్రారంభం కానుంది. దీని షెడ్యూల్?కు సంబంధించి ఈ రోజు సాయంత్రం 5 గంటలకు వెలువడనుంది. కాగా.. షెడ్యూల్ ప్రకటించకముందే గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. ఐపీఎల్ 2024 నుంచి గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ దూరం అయ్యాడు. ఎడమ చీలమండ గాయం కారణంగా ఐపీఎల్ 2024 నుండి తప్పుకోవాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి బీసీసీఐ వర్గాలు సమాచారం అందించాయి. అయితే గుజరాత్ టైటాన్స్, ఐపీఎల్ వర్గాలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.గత వన్డే ప్రపంచకప్ తర్వాత చీలమండ గాయం వల్లే ఏ సిరీస్‌లోనూ ఆడకుండా విశ్రాంతి తీసుకుంటున్నాడు. గుజరాత్ జట్టులో కీలకమైన షమీ లేకపోవడం పెద్ద దెబ్బే అని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రెండుసార్లు ఫైనల్‌కు చేరుకోవడంలో షమీ కీలక పాత్ర పోషించాడు. ఇదిలా ఉంటే.. షమీ జనవరి చివరి వారంలో లండన్‌లో ఉన్నాడని, అక్కడ తన చీలమండ గాయానికి ప్రత్యేక ఇంజెక్షన్లు చేయించుకున్నాడని, అయినప్పటికీ అతని నొప్పిని తగ్గించలేదని, ఇప్పుడు అతనికి ఆపరేషన్ తప్ప మరో మార్గం లేదని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. కాగా.. మహ్మద్ షమీ సర్జరీ కోసం యూకే వెళ్లనున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో షమీ ఐపీఎల్ ఆడటం కష్టమని అంటున్నారు.

## శ్రేయాస్‌పై విమర్శల వెల్లువ


టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్.. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి అడ్డంగా దొరికిపోయాడు. గాయం తిరగబెట్టిందని, వెన్నునొప్పి వస్తుందని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి వెళ్లిన శ్రేయాస్.. ఫిట్‌గా ఉన్నాడని తాజాగా తేలింది. శ్రేయాస్ ఫిట్‌గా ఉన్నాడని బీసీసీఐకి ఎన్‌సీఏ వైద్య బృందం రిపోర్ట్ ఇచ్చింది. మ్యాచ్ ఆడే సామర్థ్యంతో అతడు ఉన్నాడని బీసీసీఐకి ఎన్‌సీఏ నివేదిక పంపింది. దాంతో శ్రేయాస్‌పై విమర్శలు మొదలయ్యాయి. వెన్నునొప్పి కారణంగా ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్టులకు ప్రకటించిన భారత జట్టులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. రెండో టెస్టు ముగిసిన అనంతరం శ్రేయస్ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడానికి ఎఎన్‌సీఏకి వెళ్లాడు. తనకు గాయం తిరగబెట్టిందని, వెన్నునొప్పి వస్తుందనే కారణాలతో దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ 2024కి దూరమయ్యాడు. త్వరలో బరోడాతో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌కు శ్రేయాస్ జట్టుకు అందుబాటులో ఉండడం లేదని ముంబై క్రికెట్ అసోషియేషన్ పేర్కొంది.అయితే ఎన్‌సీఏ ఇచ్చిన తాజా రిపోర్ట్.. శ్రేయస్ అయ్యర్ చెప్పిన దానికి పూర్తి వ్యతిరేకంగా ఉంది. శ్రేయస్‌కు కోతగా గాయమే లేదని, అతను ఫిట్‌గా ఉన్నాడని బీసీసీఐకి ఎన్‌సీఏ రిపోర్ట్ ఇచ్చింది. మ్యాచ్ ఆడే సామర్థ్యంతో శ్రేయస్ ఉన్నాడని ఎన్‌సీఏ తన వేదికలో పేర్కొంది. దీంతో శ్రేయస్ వైఖరిపై బీసీసీఐ మండిపడుతున్నట్లు తెలుస్తోంది. రంజీ ట్రోఫీలో ఆడటానికి యువ క్రికెటర్లు ఎందుకు ఆసక్తి చూపట్లేదని అందరూ ఫైర్ అవుతున్నారు. ఐపీఎల్ 2024ను దృష్టిలో పెట్టుకుని శ్రేయస్ ఇలా చేశాడనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కూడా రంజీ ట్రోఫీలో ఆడని విషయం తెలిసిందే.



## బాంద్రాలో ఖరీదైన ఫ్లాట్ కొన్న యశస్వి జైస్వాల్

టీమిండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ వాణిజ్య రాజధాని ముంబైలో ఓ ఫ్లాట్ కొనుగోలు చేసినట్లు సమాచారం. అత్యంత ఖరీదైన బాంద్రా ప్రాంతంలో ఓ ఫ్లాట్‌ను కొనుగోలు చేశాడట. ఈస్ట్ బాంద్రాలో వింగ్ 3 ఏరియాలోని 1100 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్‌ను యశస్వి కొన్నాడట. దీని ధర దాదాపు రూ. 5.4 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. 2024 జనవరి 7న జైస్వాల్ పేరిట కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైనట్లు తెలుస్తోంది. అదానీ రియల్టీకి చెందిన బిల్డర్స్ నిర్మించిన ఈ నివాస స్థలంలో చదరపు అడుగు ధర రూ. 48 వేలుగా ఉంది. 22 ఏళ్ల యశస్వి జైస్వాల్ చిన్నపటినుంచి చాలా కష్టాలను అనుభవించాడు. 2001 డిసెంబరు 28న ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన యశస్వికి చిన్నతనం నుంచే క్రికెట్ అంటే పిచ్చి. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా అతడికి పెద్దగా ప్రోత్సాహం లభించలేదు. అయితే యశస్వి 13 ఏళ్ల వయసులో సొంతూరు భదోయిని వీడిన అతడి కుటుంబం ముంబైకి మకాం మార్చారు. ముంబైకి వచ్చిన కొత్తలో అతడు టెంట్‌లో నివసించేవాడు. డబ్బు కోసం పలు దుకాణాల్లో పనిచేసేవాడు. బాగా ఆడుతున్న యశస్విని కోచ్ జ్వాలా సింగ్ చేరదీశాడు. అక్కడ తన నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకున్న యశస్వి.. ముంబై అండర్-19 జట్టుకు ఎంపికయ్యాడు. అండర్-19, దేశవాళీ టోర్నీలలో అదరగవుతాడంతో ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు ఆడే అవకాశం వచ్చింది. ఎలాంటి బెరుకు లేకుండా.. బౌండరీలతో రెచ్చిపోయాడు. రాజస్థాన్ తరఫున 2023 సీజన్‌లో 14 మ్యాచుల్లోనే 625 పరుగులు చేశాడు. దాంతో టీమిండియాలో చోటు దక్కింది. గతేడాది వెస్టిండీస్ పర్యటనతో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఆడిన తొలి టెస్టులోనే సెంచరీ బాది తానేంటో నిరూపించుకున్నాడు. తాజాగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ వరుసగా సెంచరీలు బాదాడు. మూడు టెస్టుల్లోనే 545 పరుగులు సాధించాడు. ఇందులో రెండు ద్విశతకాలు ఉన్నాయి.

# చెన్నై వేదికగా మార్చి 22న మొదటి మ్యాచ్




## ఐపీఎల్ 2024 షెడ్యూల్ విడుదల

రిచెస్ట్ క్రికెట్ లీగ్‌కు సమయం ఆసన్నమైంది. మరో నెల రోజుల్లో ఐపీఎల్ 2024 ప్రారంభం కాబోతోంది. మార్చి 22వ తేదీన మొదటి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా జరగనుంది. అనంతరం అహ్మదాబాద్ వేదికగా 2023 సీజన్ ఫైనలిస్ట్ గుజరాత్ టైటాన్స్, హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరిస్తోన్న ముంబై ఇండియన్స్ అహ్మదాబాద్‌లో తలబడనున్నాయి. మొదటి 17 రోజులకు అనగా మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 వరకు జరగబోయే మ్యాచ్‌లకు బీసీసీఐ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇదిలా ఉంటే.. మార్చి 22 - ఏప్రిల్ 7 మధ్య 21 మ్యాచ్‌లు జరగనుండగా.. అందులో నాలుగు డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు ఉన్నాయి. మార్చి 23న మొదటి డబుల్ హెడ్డర్ మ్యాచ్‌ల్లో భాగంగా మధ్యాహ్నం మొహాలి వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తలబడనున్నాయి. ఇక అదే రోజు కోల్‌కతాలో కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఇక మార్చి 24 ఆదివారం రాజస్థాన్ రాయల్స్ తమ హెూం గ్రౌండ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలబడుతుంది. మొదటి ఫేజ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తన రెండు హెూం మ్యాచ్‌లు విశాఖపట్నంలో ఆడనుంది. కాగా, కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలకు తేదీలు ప్రకటించగానే.. మిగిలిన మ్యాచ్‌లకు కూడా షెడ్యూల్ ప్రకటిస్తుంది బీసీసీఐ.




## అండర్సన్‌ను తప్పక కొనసాగించాల్సిందేనా?




భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను విజయంతో ప్రారంభించిన ఇంగ్లండ్ క్రికెట్ జట్టు.. ఇప్పుడు సిరీస్‌ను కాపాడుకునే స్థితికి చేరుకుంది. వరుసగా 2 టెస్టు మ్యాచ్‌ల్లో ఓటమిని చవిచూసింది.దీంతో బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లిష్ జట్టు సిరీస్‌లో నిలవాలంటే రాంచీలో జరిగే నాలుగో టెస్టులో తప్పక గెలవాలి. ఫిబ్రవరి 23 శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ టెస్ట్ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ ప్లేయింగ్ ఎలెవన్‌ని ప్రకటించింది. తుది జట్టులో రెండు ప్రధాన మార్పులు చేసింది. భారత్‌తో ఆడిన 4 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు తీసిన ఓలీ రాబిన్ సన్ ను బరిలోకి దింపింది. వరుసగా నాలుగో టెస్టు మ్యాచ్‌కి, ఇంగ్లండ్ తన బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు కానీ బౌలింగ్‌లో రొటేషన్‌ను కొనసాగించింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు దూరమైన 41 ఏళ్ల వెటరన్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్ వరుసగా మూడో మ్యాచ్‌కు రంగంలోకి దిగనున్నాడు. ఈసారి అతనికి విశ్రాంతి ఇవ్వబడుతుందని భావించారు. అయితే జట్టులోని ఇతర ఫాస్ట్ బౌలర్లు కూడా అంతంత మాత్రమే రాణిస్తుండడంతో అండర్సన్‌ను తప్పక కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు, పేస్ బౌలింగ్ విభాగంలో అండర్సన్‌కు అండగా నిలిచేందుకు ఇంగ్లాండ్ చివరి ప్రయత్నంగా మీడియం పేసర్ ఆలీ రాబిన్సన్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చుకుంది. రైట్ ఆర్మ్ పేసర్ రాబిన్సన్ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.అయితే నాలుగో టెస్టులో అతను బరిలోకి దిగనున్నాడు. ఫాస్ట్ బౌలర్ మార్క్ వుడ్ స్థానంలో అతడిని చేర్చారు. 30 ఏళ్ల రాబిన్సన్ గత 7 నెలలుగా ఎలాంటి టెస్టు ఆడలేదు. జూలై 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్‌లో ఆఖరి టెస్ట్ ఆడాడు. అయితే ఈ బౌలర్ భారత్‌తో ఆడిన 4 టెస్టుల్లో 21 వికెట్లు పడగొట్టాడు. దీంతో చివరి అస్త్రంగా భారత్ ను దెబ్బ కొట్టేందుకు రాబిన్ సన్ ను బరిలోకి దింపింది ఇంగ్లండ్. అయితే రాబిన్ సన్ తీసిన వికెట్లన్నీ ఇంగ్లండ్ గడ్డమీద వచ్చినవే. మరి భారత్ పిచ్ లపై రాబిన్ సన్ ఏ మేర రాణిస్తాడో చూడాలి. రాబిన్సన్ మాత్రమే కాదు, ప్లేయింగ్ ఎలెవన్ లో మరో ఆటగాడు చోటు దక్కించుకున్నాడు. లెగ్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ మరోసారి అవకాశం దక్కించుకున్నాడు. బషీర్ విశాఖపట్నం టెస్టులో అరంగేట్రం చేసినప్పటికీ రాజ్‌కోట్ మ్యాచ్ కు దూరమయ్యాడు. ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చాడు. బషీర్ తన అరంగేట్రం టెస్టులోనే కెప్టెన్ రోహిత్ శర్మతో సహా 4 వికెట్లు పడగొట్టాడు. కాగా, సిరీస్‌లోని మూడు టెస్టులు ఆడిన యువ స్పిన్నర్ రెహాన్ 6 ఇన్నింగ్స్‌లలో 11 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు.

### ఇంగ్లండ్ ప్లేయింగ్ -ఇదే..

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఆలీ పోప్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ ఫోక్స్ (వికెట్ కీపర్), టామ్ హార్ట్లీ, ఆలీ రాబిన్సన్, జేమ్స్ ఆండర్సన్, షోయబ్ బషీర్.

## రాంచీ పిచ్‌ని చూసి షాక్‌కు గురైన బెన్ స్టోక్స్!

రాంచీ వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య శుక్రవారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లిష్ కెప్టెన్ బెన్ స్టోక్స్ పిచ్‌ను పరిశీలించి ఆశ్చర్యపోయాడు. ఇంతకుముందు ఇలాంటి వికెట్‌ను ఎన్నడూ చూడలేదని, మ్యాచ్ జరిగే కొద్దీ ఎలా మారుతుందో చెప్పడం కష్టమని పేర్కొన్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధిస్తే.. సిరీస్ రేసులో నిలుస్తుంది. ఒకవేళ ఓడితే మరో మ్యాచ్ ఉండగానే.. సిరీస్‌ను కోల్పోతుంది. రాంచీ పిచ్‌ని పరిశీలించిన అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మాట్లాడుతూ 'నేను ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి పిచ్ చూడలేదు. మ్యాచ్ జరిగే కొద్దీ పిచ్ ఎలా మారుతుందో చెప్పడం కష్టం. భారత్ కాకుండా ఇతర దేశాల మైదానాల్లో పిచ్ చూసిన వెంటనే ఒక అంచనాకు రావచ్చు. కానీ ఇక్కడ మాత్రం ప్రతి రోజూ ఓ సవాలే. ఇప్పటికైతే పిచ్‌పై పచ్చిక బాగానే ఉంది. కొన్నిచోట్ల పగుళ్లు కూడా కనిపిస్తున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ జట్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు' అని అన్నాడు. ఇది కఠినమైన పిచ్ అని ఇంగ్లండ్ వైస్-కెప్టెన్ ఓలి పోప్ పేర్కొన్నాడు. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ పిచ్‌పై చెలరేగే అవకాశం ఉందన్నాడు.



# భారత్‌ను దెబ్బకొట్టేందుకు బరిలోకి ఆలీ రాబిన్సన్



ఐదు టెస్టు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా శుక్రవారం (ఫిబ్రవరి 23) నుంచి భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. రాంచీలోని జేఎస్‌సీఏ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ ఇంగ్లండ్‌కు కీలకం. ఎందుకంటే ఇప్పుడు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-1 ఆధిక్యంలో ఉంది. 4వ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓడిపోతే సిరీస్ భారత్ వశమవుతుంది. అందువల్ల బెన్ స్టోక్స్ టీమ్ రాంచీ టెస్టు మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాల్సి ఉంది. ఇందుకోసం ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ లైనప్‌లో గణనీయమైన మార్పు తీసుకురావాలని ప్లాన్ చేసింది. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన వెటరన్ స్పీడ్‌స్టర్ జేమ్స్ అండర్సన్‌కు నాలుగో మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సీనియర్ పేసర్ స్థానంలో ఆలీ రాబిన్సన్‌ను బరిలోకి దింపాలని ఇంగ్లాండ్ కూడా యోచిస్తోంది. ఎందుకంటే రాబిన్సన్ గత మూడు గేమ్‌లలో రిజర్వ్ బెంచ్ కే పరిమితమయ్యాడు. అందువల్ల నాలుగో మ్యాచ్‌లో అతడిని ఆడే అవకాశం ఎక్కువగా ఉంది. ఆలీ రాబిన్సన్ ఇప్పటివరకు టీమ్ ఇండియాతో 4 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం 8 ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్ చేసి 21 వికెట్లు పడగొట్టాడు. రెండు సార్లు ఐదు వికెట్లు కూడా తీశాడు. తద్వారా భారత్‌పై రాబిన్‌సన్ అత్యుత్తమ ప్రదర్శనతో రికార్డు సృష్టించాడు. అందువల్ల రాంచీ టెస్టులో ఇంగ్లండ్ జట్టు స్పీడ్‌స్టర్‌ను బరిలోకి దించడం దాదాపు ఖాయం. ఈ నిర్ణయాత్మక మ్యాచ్ లో ఆడబోతున్న ఆలీ రాబిన్సన్ టీమ్ ఇండియాకు ప్రమాదకారిగా మారనున్నాడా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఫిబ్రవరి 23 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు టాస్ ప్రక్రియ జరగనుండగా, 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని స్పోర్ట్స్ 18 ఛానెల్, అలాగే జియో యాప్‌లోనూ చూడవచ్చు.

# సిరీస్‌పై కన్నేసిన రోహిత్ సేన

### నేటినుండి రాంచీలో నాలుగో టెస్టు

రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లండ్‌ను 434 పరుగుల తేడాతో ఓడించిన భారత్ ఇప్పుడు మరో కీలక సమరానికి సిద్ధమైంది. రాంచీలోని జెఎస్‌సిఎ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో నాలుగో టెస్టు కోసం ప్రాక్టీస్ ప్రారంభించింది భారత జట్టు. శుక్రవారం (ఫిబ్రవరి 23) నుంచి మ్యాచ్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఐదు మ్యాచ్ ల సిరీస్‌లో టీమిండియా 2-1 ఆధిక్యంలో ఉంది. ఈఈ టెస్టు మ్యాచ్‌లో గెలిస్తే, ఇంగ్లిష్ జట్టుతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంటుంది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ గెలవాలని రోహిత్ సేన పట్టుదలతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తోంది.దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. టీమిండియా ఆటగాళ్లు బుధవారమే రాంచీకి చేరుకుని ప్రాక్టీస్ ప్రారంభించింది. బీసీసీఐ ప్రాక్టీస్ ఫోటోలను షేర్ చేసింది. సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్, రజత్ పటీదార్ వంటి టీమిండియా యువ ఆటగాళ్లు నెట్ సెషన్‌లో చెమటోడ్చారు. రాంచీలో భారత్ ఇప్పటి వరకు కేవలం 2 టెస్టు మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. ఒక టెస్టులో విజయం సాధించగా మరొకటి డ్రా అయ్యింది. మార్చి 2017లో ఆస్ట్రేలియాతో జరిగిన ఓ మ్యాచ్ లో 210 ఓవర్లలో 9 వికెట్లకు 603 పరుగులు చేసింది టీమిండియా. రోహిత్ శర్మ తన కెరీర్ బెస్ట్ స్కోరు 212 పరుగులు కూడా ఈ గ్రౌండ్ లోనే చేయడం విశేషం. ఈ మైదానంలో రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా, అజింక్య రహానే, ఛతేశ్వర్ పుజారా తలా సెంచరీ చేశారు. రవీంద్ర జడేజా రెండు టెస్టుల్లో రెండు అర్ధశతకాలు సాధించాడు. అత్యధిక సిక్సర్ల జాబితాలో రోహిత్ శర్మ (6) ఉన్నాడు. అలాగే అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్లలో రవీంద్ర జడేజా (12 వికెట్లు) ఉన్నాడు.

### భారత టెస్టు జట్టు:

రోహిత్ శర్మ (కెప్టెన్), యస్సవి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పాటిదార్, సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, సుందర్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com